


ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసిన ఎంపీ



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఢిల్లీలోని పార్లమెంట్ నూతన భవనం ఎఫ్-101 వసుధలో నిర్వహించిన పోలింగ్‌లో ఆయన ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ కు అనుకూలంగా ఆయన ఓటు వేసినట్లు సమాచారం.

నేటి నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ వనరుల శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 53 మండలాల నుంచి ప్రతి మండలం నుంచి ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు శిక్షణకు హాజరు అవుతారని చెప్పారు. సొంత ఆదాయ వనరుల అంశంపై జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల శిక్షణ కేంద్రంలో ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి సొంత ఆదాయ వనరుల సృష్టి, స్వంత ఆదాయంలో పన్ను వనరుల, పన్ను వసూళ్లతో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పిస్తారన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నగరంలోని 'కుడా' కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్రూవల్ లేకుండా భవనాలు నిర్మించకూడదని అన్నారు. ఐదేళ్ల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు, భవనాలు నిర్మించుకున్నారన్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రుసుములు చెల్లించడం లేదన్నారు. అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తే వాటిని కూల్చడానికి ప్రభుత్వానికి అధికారం ఉందన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపాలిటీ, కుడా కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

200 ఎకరాల్లో నీట మునిగిన పంట

- వర్షపు నీరు వెళ్లకుండా మట్టిని అడ్డంగా వేయడంతో నష్టం
- ఓ వైసీపీ నాయకుడి నిర్వాకం
- ఎమ్మెల్యేను ఆశ్రయించిన రైతులు




వర్షపు నీరు వెళ్లకుండా అడ్డుగా వేసిన మట్టిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడి నిర్వాకంతో 200 ఎకరాల పంట నీటిలో మునిగిపోయింది. ఎవరికైనా ఇబ్బంది అనిపిస్తే వారి పొలాలను సైతం తీసుకుంటానని హెచ్చరించినట్లు బాధిత రైతులు చెప్పారు. పట్టణానికి చెందిన రమేష్, ముల్లా నజీర్, గంగన్న, హుసేననప్ప, సురేష్‌బాబు, శేఖర్ మరో 20 మంది రైతులు సుమారు 200 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. ఈ పొలాలు బైపాస్ పక్కనే ఉన్నాయి. రైతులు తెలిపిన వివరాలివీ.. ఇటీవల వైసీపీకి చెందిన ఓ బడా నేత రెండు ఎకరాల పొలాన్ని కొనుగోలు చేశారు. పత్తి పంటను సాగుచేసిన ఆ బడా నేత తన పొలంలో నుంచి వెళ్లే నీటికి అడ్డుకట్ట వేశారు. దీంతో వర్షపు నీరు నిల్వ ఉండి 200 ఎకరాలు పంట నీట మునిగాయి. ఏమి చేయాలో దిక్కుతోచని ఆ రైతులు బడా నేతను ఎదురించలేక లోలోనే కుమిలిపోయారు. ఎలాగైనా అడ్డు వేసిన మట్టిని తొలగించాలని ప్రాధేయపడ్డారు. ఆ నేత కనికరించకపోగా.. మీ పొలాలను కూడా విక్రయించాలంటూ హుకుం జారీ చేశారు. దీంతో ఆ రైతులు ఎమ్మెల్యే పార్థసారథి దగ్గరికి వెళ్లి మొరపెట్టుకున్నారు. రైతుల అభ్యర్థన మేరకు జింక వంక స్థలానికి అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎలా ఉండేదో అలాగే వర్షపు నీరు పొలాల నుంచి జింక వంక రూపంలో వెళ్లిపోయేలా చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో రాజీపడబోనని, ఎవరు ఎదురొచ్చినా ఎదుర్కొంటానని హెచ్చరించారు. ఎవరైనా అడ్డు చెప్పినా పట్టించుకోవద్దని, రైతులకు ఎటువంటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులతో రాజకీయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా రైతులను ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అడ్డుకట్ట వేసిన బడానేతపై మండిపడ్డారు. నీళ్లు వెళ్లేంతవరకు అధికారులు సైతం అక్కడే ఉండాలని సూచించారు. అనంతరం సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు పలువురు రైతులు పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ, పంచాయతీరాజ్‌శాఖ డీఈ రాణి, ఏఈలతో పాటు మరికొందరు అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డిజిటల్ అసిస్టెంట్లకు గ్రేడ్-6 నుంచి గ్రేడ్-5కి పదోన్నతులు లభించనున్నాయి. ఈ మేరకు 122 మందికి పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు వెరిఫికేషన్ చేసి పోస్టింగ్‌లు కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



- 5.20 లక్షల విద్యార్థులకు 'తల్లికి వందనం'
- తల్లుల ఖాతాల్లో రూ.786 కోట్లు
- 6.40 లక్షల కుటుంబాలకు 'దీపం'
- కష్టజీవులకు చేయూత 'అన్నదాత సుఖీభవ'
- రైతుల ఖాతాల్లో రూ.112 కోట్లు
- పేదల ఆకలి తీర్చిన 'అన్న క్యాంటీన్లు'
- 15 నెలల పాలనలో చంద్రబాబు మార్క్



కోసిగిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన తల్లికి వందనం లబ్ధిదారులు (ఫైల్)

కష్టాలున్నా.. హామీల అమలు



కర్నూలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సుపరిపాలన 15 నెలలు పూర్తి చేసుకుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరే సమయానికి రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఇబ్బందులెన్ని ఉన్నా.. 'సూపర్ సిక్స్' అమలు దిశగా అడుగులు వేశారు. పక్కా ప్రణాళికతో ప్రజలకు ఆరు వరాలు అందించారు. 'వైకుంఠపాళి'గా మారిన రాష్ట్రాభివృద్ధికి గట్టెక్కిస్తూనే.. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తున్నారు. సుస్థిర ప్రభుత్వంతోనే సత్ఫలితాలు సాధ్యమని చాటుతున్నారు. కందనవోలు ముంగిట కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 'తల్లికి వందనం' పేరిట 5.20 లక్షల విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.786 కోట్లు జమ చేశారు. మెగా డీఎస్సీ-2025 పక్కాగా అమలు చేసి నిరుద్యోగ యువతకు చేయూత అందించారు. 'అన్నదాత సుఖీభవ' అంటూ కష్టజీవుల ఖాతాల్లో రూ.112 కోట్లు జమ చేశారు. 6.40 లక్షల మంది పేదలకు 'దీపం పథకం' కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్నారు. అదే క్రమంలో పారిశ్రామిక అభివృద్ధి, పల్లె ప్రగతి వైపు వేగంగా అడుగులు వేస్తోంది కూటమి ప్రభుత్వం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు సక్సెస్‌గా అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం అనంతపురం జిల్లాలో 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.

● డబ్బు లేకుండా గమ్యానికి చేరుతున్నాం



కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం మాలాంటి సామాన్య మహిళలకు ఓ వరం. పైసా లేకుండా గమ్యానికి చేరుస్తున్నారు. 25 రోజుల్లో నాలుగు సార్లు ఉచిత ప్రయాణం సౌకర్యం ఉపయోగించుకున్నాను. ఇది పేద మహిళలకు ఎంతో ఉపయోగకరం.

● మహాలక్ష్మి, ఎమ్మిగనూరు

5.20 లక్షల విద్యార్థులకు తల్లికి వందనం



జిల్లాలో 25 మండలాల్లో వివిధ ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలు 1,202, ప్రాథమికోన్నత పాఠశాలలు 508, ఉన్నత పాఠశాలలు 532 కలిపి 2,242 పాఠశాలలు ఉన్నాయి. 4,73,823 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 160 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో 46 వేల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. అర్హులైన 3,67,614 మంది విద్యార్థులకు రూ.13వేలు చొప్పున 2,16,181 తల్లుల ఖాతాలో రూ.477.90కోట్లు, ఇంటర్ చదివే 46 వేల విద్యార్థులకు రూ.69 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేశారు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా పేద విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఇంట్లో ఒకే విద్యార్థి మాత్రమే 'అమ్మ ఒడి' ఇస్తే, కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎందరు విద్యార్థులు ఉంటే అందరికి 'తల్లికి వందనం' అమలు చేశారు.

మట్టిమనిషికి అండగా 'అన్నదాత సుఖీభవ'



రైతులకు పెట్టుబడి సాయం అందించాలనే సంకల్పంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేశారు. ఆగస్టు ఒకటో తేదీన అన్నదాతల ఖాతాల్లో ఆర్థిక సాయం డబ్బు జమ చేశారు.

మిగతా 8వ పేజీలో...

పింఛన్ ఒకేసారి రూ.వెయ్యి పెంచారు



రాష్ట్ర విభజనకు ముందు పింఛన్ రూ.200లే వచ్చేది. టీడీపీ ప్రభుత్వం సీఎం చంద్రబాబు ఐదు రెట్లు పెంచి రూ.వెయ్యి చేశారు. ఆ తరువాత రూ.2 వేలకు పెంచారు. 2019 ఎన్నికల్లో రూ.3 వేలు చేస్తానని అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లలో విడతల వారిగా రూ.వెయ్యి పెంచితే, కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకేసారి వెయ్యి పెంచి రూ.4వేలు చేసింది.

● నేసే అంబమ్మ, కోసిగి

డబ్బు వసూళ్లు చేస్తే చర్యలు

- ఎన్టీఆర్ వైద్య సేవ కింద మెరుగైన సేవలు అందించాలి
- ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోగుల నుంచి డబ్బు వసూలు చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రంజిత్ బాషా ఆసుపత్రి యాజమాన్యాలను హెచ్చరించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ వైద్య సేవకు సంబంధించి ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల యజమాన్యాలతో మంగళవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ కింద రోగులకు ఉచితంగా వైద్యం అందించే పథకం అని, రోగుల నుంచి డబ్బులు తీసుకోవడం సరికాదని అన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద రోగులకు మానవతా దృక్పథంతో వైద్యసేవలు అందించాలని, కమర్షియల్ పద్ధతిలో ఆలోచన చేయకూడదని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి ఎవరైనా రోగులు వచ్చినప్పుడు వారు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కార్డు మరిచిపోయినా, వారికి ముందుగా ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఎన్‌రోల్ చేసి ఉచితంగా ఓపీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పలు ఆసుపత్రి యాజమాన్యాలు రోగుల నుంచి డబ్బు తీసుకుంటున్నట్లు ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణలో తేలిందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఆసుపత్రుల యజమాన్యాలను ఆదేశించారు. సమావేశంలో ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవీఎస్ ఎస్వీ భాస్కర్ రెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి, డీసీహెచ్ఎస్. డాక్టర్ జప్రుల్లా పాల్గొన్నారు.

ఉల్లి రైతులకు రూ.10 కోట్లు మంజూరు

- కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పండించిన ఉల్లిని క్వింటం రూ.1,200 చెల్లించి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని, ఇప్పటి దాకా సేకరించిన ఉల్లికి సంబంధించి రైతులకు ఇవ్వడానికి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం ఉల్లి కొనుగోళ్ల అంశానికి సంబంధించి కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కొనుగోళ్ల కమిటీతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్, కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి ఆధార్, బ్యాంకు అకౌంటు, ఈక్రాప్ తదితర వివరాలను తీసుకుని ఎక్కడా పొరపాట్లు లేకుండా ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మే నెలలో సాగుకు సంబంధించి ఈనెల 20 వరకు దిగుబడులు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని ఉద్యానశాఖ జిల్లా అధికారి రామాంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. జేసీ నవ్య మాట్లాడుతూ కర్నూలు మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిలో 200 టన్నులు తాడేపల్లి గూడేనికి, 200 టన్నులు హైదరాబాద్‌కు, 80 టన్నులు రైతు బజార్లకు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, ఏడీఎం నారాయణమూర్తి, మార్క్‌ఫెడ్ డీఎం రాజు పాల్గొన్నారు.

పని మనిషే ప్రాణం తీసింది.. 7
పెద్ద పరిశ్రమతో పేద రైతు పోరాటం
రైతులకు రెండు పూటలా భోజనం ఏర్పాటు చేయాలి 6

రేపటి నుంచి సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు ఈ నెల 11, 12 తేదీల్లో ఇన్‌స్పైర్ మనక్-2025 శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో శామ్యూల్ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న కర్నూలు డివిజన్ ఉపాధ్యాయులకు, 12న ఆదోని డివిజన్ ఉపాధ్యాయులకు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తమ వెంట విద్యార్థులకు సంబంధించిన వివరాలు సేకరించుకుని శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్స్ Www. inspireawards.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ సెల్ నెంబర్ 8790111331లో సంప్రదించాలని సూచించారు.

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం

- యూరియా కోసం ఆందోళనలు చేస్తున్నా స్పందించడం లేదు ● 'అన్నదాత పోరు'లో వైసీపీ నాయకుల ధ్వజం



ర్యాలీగా వెళ్తున్న వైసీపీ, రైతు సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవడం లేదని, యూరియా కోసం ఆందోళనలు చేస్తున్నా స్పందించడం లేదని వైసీపీ నాయకులు ధ్వజమెత్తారు. నగరంలో వైసీపీ ఆధ్వర్యంలో మంగళవారం 'అన్నదాత పోరు' చేపట్టారు. చిన్నపార్కు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో వ్యవసాయ రంగం కుదేలైపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. బస్తా యూరియా కోసం గంటల తరబడి పడిగాపులు కాస్తున్న అందించడం లేదని ఆరోపించారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఆర్డీవో సందీప్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీశ్, 'కుడా' మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, అహ్మద్ అలీఖాన్, కార్పొరేటర్లు, అనుబంధ విభాగం నాయకులు, రైతులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వంద శాతం అడ్మిషన్లు పూర్తి చేస్తాం

● ఉర్దూ యూనివర్సిటీ వీసీ పీఎస్ షాషావలి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2025-26 విద్యాసంవత్సరానికి వంద శాతం అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని వీసీ పీఎస్ షాషావలి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఈ ఏడాది 50 శాతం అడ్మిషన్లతో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో అడ్మిషన్ల ప్రక్రియ 24శాతం ఉండగా ఒక్క ఉర్దూ వర్సిటీలోనే అడ్మిషన్లు పెరగడం విశేషమన్నారు. ఈనెల 22 నుంచి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. డిగ్రీ 3 కోర్సులు, పీజీలో 9 కోర్సుల్లో 330 మంది విద్యార్థులు విద్యార్థులు అడ్మిషన్లు పొందారన్నారు. 2016లో ప్రారంభమైన వర్సిటీలో మొదటి సారిగా అత్యధికంగా అడ్మిషన్లు పెరిగాయని వీసీ పేర్కొన్నారు.

అండర్-19 క్రీడా షెడ్యూల్ విడుదల

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అండర్-19 బాలబాలికల క్రీడా జట్ల ఎంపిక షెడ్యూల్‌ను జిల్లా వృత్తి విద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు, ఆర్ఐఓ లాలెప్ప ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ ఆర్చరీ, షూట్కా, సెపక్‌తక్రా క్రీడల ఎంపిక కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరుగుతాయి. ఈ నెల 11న ఫుట్‌బాల్ ఎమ్మిగనూరు ప్రభుత్వ కళాశాలలో, 12న ఫెన్సింగ్, కురాష్ ఉషా డీఎస్ఏ స్టేడియంలో కర్నూలులో, 13న సైక్లింగ్, కరాటే మాల్కంబ్ సాఫ్ట్ టెన్నిస్ డీఎస్ఏ కర్నూలులో 15న జూడో, కవియర్ పట్టు నెట్‌బాల్, రైఫిల్ షూటింగ్ కర్నూలులో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. 1.1.2007 తర్వాత జన్మించిన వారు ఎస్ఎస్‌సీ జాబితాతో ఎంపికకు హాజరుకావాలన్నారు. వివరాల కోసం 9440864732ను సంప్రదించాలని తెలిపారు.



ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా రాఘవేంద్ర : కర్నూలు జిల్లా అండర్-19 కార్యదర్శిగా వీడీ రాఘవేంద్ర ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన సి.బెళగల్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యాసంస్థల్లో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు రాఘవేంద్రను ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎంపిక చేసింది.

ఏ,బీ,సీ క్వార్టర్స్ ఖాళీ చేయిస్తున్నాం

● ఆర్డీవో సందీప్ కుమార్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త ఆదేశాల మేరకే నగరంలోని ఏ, బీ, సీ క్వార్టర్స్‌లో అక్రమంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయిస్తున్నామని ఆర్డీవో సందీప్ కుమార్ మంగళవారం వెల్లడించారు. అక్రమంగా నివాసాలు ఉంటున్న వారు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని, ప్రజలందరూ ఈ విషయాన్ని తెలుసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఖాళీ చేయించే ప్రక్రియ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

క్షణికావేశం.. అనర్థదాయకం..!

● ఒక్క క్షణం ఆగండి.. ఆలోచించండి
● బలవన్మరణం ఎంత వరకు సమంజసం?
● ఆత్మహత్యలతో జీవితాలే నాశనం
● ప్రతి వంద మరణాల్లో ఒక ఆత్మహత్య
● నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం




క్షణికావేశంలో తీసుకునే ఓ నిర్ణయం ఎన్నో అనర్థాలకు దారితీస్తోంది. ఆవేశానికో.. ఒత్తిడికో.. మనోవేదనకో లోనై తీసుకునే నిర్ణయం జీవితాలను నాశనం చేస్తోంది. బలవన్మరణానికి పాల్పడే ముందు ఒక్క క్షణం ఆగండి.. ఆలోచించండి. మనల్ని నమ్ముకొని మనమీద ఆధార పడి జీవించే వారు పరిస్థితి ఏమిటి? చిన్నచిన్న సమస్యలకే కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడటం ఎంత వరకు సమంజసం? తాము పోయినంత మాత్రాన సమస్యలు మాయమవుతున్నాయా? సమస్యలుంటే ఎదుర్కొని పోరాడాలి.. భయపడితే ఎలా? భయాన్ని జయించి జీవితాన్ని విజయం వైపు మళ్లించండి. అప్పుడే జీవన ప్రయాణం సాఫీగా సాగుతోంది. బలవన్మరణాలకు పాల్పడేవారిలో మనోధైర్యాన్ని నింపుద్దాం. ఆత్మహత్యలను నివారిద్దాం. 2003లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్, డబ్లూహెచ్‌వో సంయుక్తంగా ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినంను నిర్వహిస్తుంది. ఈ ఏడాది 'ఆత్మహత్యపై కథనాన్ని మార్చడం' అన్న నినాదాన్ని ఇచ్చింది. ఆత్మహత్యల నివారణల దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

● వెల్దుర్తి మండలానికి చెందిన ఓ రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. తనకున్న రెండున్నర ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని పంట సాగు చేశారు. గత ఏడాది పంటలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఈసారి కూడా 8 ఎకరాల్లో పంటలు వేసి దిగుబడులు రాని పరిస్థితి నెలకొంది. ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

● మంత్రాలయం మండలం మాలపల్లికి చెందిన 21 ఏళ్ల యువకుడు ఈ నెల 1వ తేదీ ఇంట్లో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కర్నూలులో చికిత్స పొందుతూ ఈ నెల 6వ తేదీన మరణించాడు.

● మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో 21 ఏళ్ల ఓ విద్యార్థి నంద్యాలలోని ఓ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



సోషల్ మీడియా.. బెట్టింగ్‌లతోనే



17 నుంచి 25 సంవత్సరాలలోపు ఉండే యువతలో సోషల్ మీడియా, డ్రగ్స్, బెట్టింగ్‌లతోనే చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో పరిచయం కారణంగా ప్రేమలు పెరిగి, అవి విఫలం కావడంతో కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పిల్లలు మొబైల్‌ను ఎలా చూస్తున్నారో తరుచూ తల్లిదండ్రులు గమనించాలి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మెరుగు పరచాలి.

● డా.కంచర్ల హరిప్రసాద్, నరాలు, మానసిక వ్యాధి నిపుణుడు, సంఘమిత్ర క్లినిక్, కర్నూలు

ప్రవర్తనలో మార్పులను గమనించాలి



ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న వారిలో ప్రవర్తన పరంగా చిన్న చిన్న మార్పులను గమనించాలి. ఆత్మహత్యలు ఎక్కువగా 15 నుంచి 24 ఏళ్ల వారిలో కనిపిస్తుంటాయి. ఆత్మహత్య ప్రయత్నాలు మహిళల్లో ఎక్కువగా ఉంటాయి. ఆత్మహత్యలతో చనిపోయే వారిలో మగవారే అధికంగా ఉంటారు. వ్యాయామం, యోగా, మెడిటేషన్, క్రీడలపై ఆసక్తి కలిగి ఆత్మస్థైర్యంతో ముందుకు వెళితే ఆత్మహత్యలను నివారించొచ్చు.

- డా.కే.సుహృత్ రెడ్డి, నరాలు, మానసిక వ్యాధుల నిపుణుడు, ఆశా కిరణ్ మైండ్ కేర్, కర్నూలు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉన్నది ఒక్కటే జీవితం. దాన్ని అర్థాంతరంగా కాలదన్నుకుంటే మన కథ అక్కడితోనే పరిసమాప్తమవుతుంది. ఏదో సాధించాలనే తపన.. ఏమీ సాధించలేదేనన్న నిరాశ.. ఇంకేమీ సాధించలేమోనన్న నిస్పృహ. ఇలాంటి స్థితిలోనే ఎంతోమంది నిండు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. ఆత్మహత్యలకు తెగబడే ముందు ఒక క్షణం ఆగి.. తమను తాము ప్రశ్నించుకుంటే ఎన్నో జీవితాలు నిలబడుతాయి. తిరిగి పచ్చగా కళకళలాడుతాయి. ఇందుకు మనమంతా కలిసికట్టుగా ప్రయత్నించడం అత్యవసరమని ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం గట్టిగా నినదిస్తోంది.

● రోజూ వార్త పత్రికల్లో కనిపించే ఆత్మహత్యల వార్తలు చదివి అయ్యో అనుకుంటాం. చావాలనుకుంటే కనిపించేది ఒక్కటే కారణం. కానీ బతకడానికి వేయి కారణాలున్నాయి. తీవ్రమైన నిర్ణయం తీసుకోవడానికి ప్రేరేపిస్తున్న పరిస్థితులేమిటీ? అందులో సమాజం బాధ్యత ఎంతో ఉంది.

హెచ్చరిక సంకేతాలపై కన్నేయండి

ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న వారిలో ప్రవర్తనా పరంగా కొన్ని మార్పులు స్పష్టంగా కనిపిస్తుంటాయి. ఈ మార్పులు కనిపిస్తే ఆలస్యం చేయరాదు. ఒంటరిగా ఉండడానికి ఇష్టపడటం. స్నేహితులకు, బంధువులకు దూరంగా ఉండటం, పండుగలు, వివాహాల వంటి వేడుకల్లో పాల్గొనకపోవడం. సామాజిక కార్యక్రమాలంటే ఆసక్తి లేకపోవడం. ఆత్మహత్య లేఖలు రాయడానికి ప్రయత్నించడం చావు గురించి ఎక్కువగా మాట్లాడటం.

రైతులకు రెండు పూటలా భోజనం ఏర్పాటు చేయాలి

● ఎక్కువ కాలం నిల్వ ఉండే ఉల్లిని జిల్లాలో సాగు చేయించండి
● కలెక్టర్ రంజిత్ బాషా



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతులకు రెండు పూటలా భోజనం ఏర్పాటు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ అమ్మకానికి ఉల్లిని తీసుకువస్తున్నారని, కొన్ని సమయాల్లో ఒక్కరోజులోనే ఉల్లి అమ్మకాలు జరగకపోవడం వల్ల రైతులు రాత్రి కూడా ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోందని అన్నారు. అందువల్ల రైతులకు రాత్రి సమయంలో కూడా తక్కువ ధరకే భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా సెక్రటరీ జయలక్ష్మిని ఆదేశించారు. మధ్యాహ్నం రూ.15కు భోజనం అందిస్తున్నామనీ, కలెక్టర్ ఆదేశాలపై రాత్రి కూడా కేవలం రూ.10కే భోజనం అందిస్తామని కలెక్టర్‌కు సెక్రటరీ వివరించారు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి అమ్మకాలు ఎలా జరుగుతున్నాయో కలెక్టర్ రంజిత్ బాషాతో పాటు జాయింట్ కలెక్టర్ నవ్య, ఎస్పీ విక్రాంత్ పాటిల్, మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులు తదితరులు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కూడా మహారాష్ట్ర రైతుల మాదిరి ఎక్కువ కాలం మన్నిక వచ్చే ఉల్లిని సాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారికి సూచించారు. కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ మాట్లాడుతూ మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి 14,325 క్వింటాళ్ల ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారని, అందులో 6,749 క్వింటాళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారని, మిగిలిన 7,576 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేశారని వివరించారు. మంగళవారం రైతులకు జమ కావాల్సిన మొత్తాన్ని సంబంధించి రూ.కోటిని రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేందుకు చర్యలు తీసుకున్నామని మార్క్‌ఫెడ్ డీఎం రాజు తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డుకు ఒక్కో కమీషన్ ఏజెంటు రైతుల నుంచి 400 బస్తాల కన్నా ఎక్కువ ఉల్లిగడ్డలు తెప్పించకూడదని తెలియజేశామని సెక్రటరీ జయలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలలు, మోడల్ స్కూల్‌లో వసతి సౌకర్యం లేని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. పరీక్ష రుసుం జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.50, చెల్లించాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 4 నుంచే స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే చివరితేదీ ఈనెల 30వ తేదీ చివరి గడువు అని తెలిపారు. పరీక్ష రుసుం చెల్లించిన తర్వాత ఆన్‌లైన్ దరఖాస్తు, చలానాలు, ఆదాయం, కుల, 8వ తరగతి స్టడీ మా ర్కుల జాబితా, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను జతపరిచి డీఈవో కార్యాలయంలో అక్టోబరు 1వ తేదీ లోపు సమర్పించాలన్నారు. డిసెంబరు 7న పరీక్ష ఉంటుందని చెప్పారు.

తగ్గేదేలే..!

● రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
● ప్రభుత్వ క్వార్టర్స్‌ను ఖాళీ చేయం
● ఉద్యోగిపై మహిళా నేత, అనుచరుల దాడి?
● పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
● ఫిర్యాదు చేసిన ఉద్యోగి
● కూటమి నేతలను ఆశ్రయిస్తున్న ఆక్రమణ దారులు



ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కుల సంఘాలు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ క్వార్టర్స్‌లో తిష్టవేసిన ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ చేసే ప్రసక్తే లేదంటున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల ఫిర్యాదులతో జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. నగరంలో ప్రధాన కాలనీగా ఉండటం.. అందులో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమాలకు కేరాఫ్‌గా నిలిచాయనే విమర్శలున్నాయి. కోట్ల విలువ చేసే ఇళ్లు, స్థలాలను కబ్జాదారుల్లో వైసీపీకి చెందిన పలువురు నాయకులు, అనుచరులు, బంధువులు, కుల సంఘాల నాయకులు శాసిస్తున్నారనే ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారుల బెదిరింపులతో కొందరు జిల్లా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆపార్టీలోకి కొందరు చేరి మళ్లీ ప్రభుత్వ క్వార్టర్స్‌పై పెత్తనం యథావిధిగా చెలాయిస్తుండటంతో ఖాళీ చేయించే ప్రక్రియ ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నచందంగా మూడు నెలలుగా సాగుతోందనే విమర్శలున్నాయి.

రెవెన్యూ విభాగంలో ఉద్యోగులు..

విద్యుత్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, నగరపాలక సంస్థ, పోలీసుల ఆధ్వర్యంలో సాఫీగా సాగాల్సిన ప్రక్రియను కొందరు కష్టతరం చేస్తున్నారు. రెవెన్యూ విభాగంలోని కొందరు ఉద్యోగులు ఆక్రమణ దారులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో ఏరివేత ప్రక్రియకు తూట్లు పొడుస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూలో క్వార్టర్స్ కేటాయించే విభాగంలోని కొందరు ఉద్యోగులు ఈ చర్యలకు పాల్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగి కనుసన్నల్లో 20 గృహాలు ఆక్రమణలో ఉండటం కొసమెరుపు.

కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నా..

ప్రభుత్వ క్వార్టర్స్‌ను ఖాళీ చేయించాలని కలెక్టర్ రంజిత్‌బాషా సీరియస్‌గా తీసుకున్నారు. అయినప్పటికీ లెక్క చేయడం లేదన్న ప్రచారం ఉంది. ఈనెల 7వ తేదీ లోపు ఖాళీ చేయాలని మూడు నెలల ముందే నోటీసులు జారీ చేశారు. గడువు ముగిశాక ఖాళీ చేయాలంటూ మూడు బృందాలుగా ఏర్పడి అక్రమార్కుల ఇళ్లకు నీరు, విద్యుత్ కట్‌చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఓ మహిళా నేత తన అనుచరులతో ఆర్అండ్‌బీ ఉద్యోగిపై దాడులకు తెగబడ్డారు. ఆ ఉద్యోగి మహిళా నేత, అనుచరవర్గంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడవ పట్టణ పోలీసులు జమీలా, సునీత మరి కొందరిపై కేసు నమోదు చేశారు. అయినా కూడా తాము ఖాళీ చేసే ప్రసక్తే లేదంటూ ఎదురు దాడులకు పూనుకుంటున్నారు. పోలీసులు కూడా ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారనే విమర్శలున్నాయి.

నాడు వైసీపీ.. నేడు కూటమి నాయకులతో..

వైసీపీ హయాంలో పెత్తనం చెలాయించినా చోటా నాయకులే కూటమి నాయకుల అండదండలతో జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి పెంచుతూనే ఆందోళనలు, నిరసనలకు సిద్ధమయ్యారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరులుగా ముద్రవేసుకున్న ఓనేత 60 ఇళ్లలో పాగా వేశారని కొందరు ఉద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ మహిళా నేత కొందరు అనుచరులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు.

నోటీసులు ఇచ్చినా..

నోటీసులు ఇచ్చినప్పటికీ తమపై దాడులకు తెగబడటమేమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం ఎదుట కుల సంఘాలతో ఆందోళనలు చేయించారని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కోట్ల విలువైన ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉద్యోగులు ఉండాల్సిన ప్రదేశాల్లో వీరి పెత్తనమేమిటని మండిపడుతున్నారు. కుల సంఘాలు, పలు సొసైటీల పేరుతో ఉన్న ఆక్రమణదారులు ఉన్న ఫలంగా తాము ఎక్కడికి వెళ్లాలని పైగా ప్రశ్నించడమేమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బనవాసిలో చోరీ

3 తులాల బంగారం, రూ.60 వేలు, వెండి ఆభరణాలు అపహరణ

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి గ్రామంలో ఈనెల 7న చోరీ జరిగింది. ఎమ్మిగనూరు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. ఈనెల 7న బనవాసి గ్రామానికి చెందిన మాల విజయ్‌కుమార్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కుటుంబ సభ్యులు తమ పనినిమిత్తం బయటకు వెళ్లగా ఇంట్లో చొరబడి 3 తులాల బంగారంతో పాటు రూ.60 వేల నగదు, వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఇళ్ల తెరిచి ఉండడం, ఇంట్లో వస్తువులు చిల్లరవందరగా పడి ఉండడాన్ని గమనించి చోరీ జరిగిందని గుర్తించారు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని చోరీ వివరాలను అడిగి తెలుసుకొని విచారణ చేపట్టారు.

వేరుశనగ ధర గరిష్ఠం రూ. 7,490

● ఎమ్మిగనూరు మార్కెట్‌కు భారీగా వేరుశనగ ఉత్పత్తులు



ఎమ్మిగనూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగ ధర క్వింటా గరిష్ఠం రూ. 7,490 పలికింది. మార్కెట్‌కు ఎమ్మిగనూరు చుట్టుముట్టు ప్రాంతాల నుంచే కాకుండా పత్తికొండ, డోన్, కోడుమూరు, తెలంగాణ, కర్ణాటక నుంచి భారీగా వేరుశనగను రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. 11,462 బస్తాల వేరుశనగ, 738 బస్తాలు ఆముదాలు విక్రయానికి వచ్చాయి. దీంతో మార్కెట్ పంట ఉత్పత్తులతో కళకళలాడింది. వేరుశనగ క్వింటం కనిష్ఠ ధర రూ. 2368, మధ్యస్థ ధర రూ. 5470 పలికింది. అలాగే ఆముదాలు ధర క్వింటా గరిష్ఠం రూ. 6139, మధ్యస్థం రూ. 6039, కనిష్ఠం రూ. 5590, పలికింది. గత వారంలో కన్నా ఈ వారంలో వేరుశనగ ధర రూ. ఏడు వేలు దాటి పలకటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జేఎన్ శేషయ్య మృతి తీరని లోటు

● టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య
● పలువురు కవులు, కళాకారుల నివాళి



జేఎన్ శేషయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాహితీ, సాంస్కృతిక రంగాల్లో జేఎన్ శేషయ్య బలమైన ముద్ర వేశారని, ఆయన మృతి తీరని లోటని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. కర్నూలుకు చెందిన ప్రజా సంఘాల నాయకుడు, సుందరయ్య స్ఫూర్తికేంద్రం కన్వీనర్ జేఎన్ శేషయ్య (68) సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం కృష్ణనగర్ ఐటీసీ సమీపంలోని సాయినగర్‌లోని గృహం వద్ద జేఎన్ శేషయ్య మృతదేహాన్ని పత్తి ఓబులయ్యతోపాటు పలువురు కవులు, కళాకారులు సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ కర్నూలులో బాలోత్సవాల నిర్వహణలో అత్యంత కీలకంగా పనిచేసిన ఘనత జేఎన్ శేషయ్యకు దక్కుతుందని శ్లాఘించారు. స్రవంతి నగర అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ మాట్లాడుతూ సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, చైతన్యవంతమైన కార్యక్రమాల్లో జేఎన్ శేషయ్య ఎంతో ముందుండి నడిపించేవారని అన్నారు. ఆయన ఆకస్మిక మరణం ప్రజా సంఘాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి నాటకపోటీల్లో

సత్తా చాటిన 'జగదేక సుందరి సామా'

● ఉత్తమ ప్రదర్శనతో పాటు నాలుగు అవార్డులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని సత్యసాయి సేవా సమితి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్, అమరావతి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 8 వరకు నిర్వహించిన జాతీయస్థాయి నాటక పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా' చారిత్రక పద్య నాటకం ప్రథమ బహుమతి అందుకుంది. అలాగే ఈ నాటకంలో వివిధ పాత్రల్లో నటించిన నలుగురు కళాకారులకు వ్యక్తిగత అవార్డులు కైవసం చేసుకున్నారు. మంగళవారం అనంతపురంలోని శ్రీకృష్ణ కళామందిరంలో ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ప్రథమ బహుమతిని అందుకున్నారు. అలాగే ఉత్తమ దర్శకుడిగానూ ఈ నాటకానికి ఆయనకు అవార్డు లభించింది. పత్తి ఒబులయ్యకు ప్ర శంసాపత్రం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ నాటకంలో ఉత్తమ పాత్రగా కె. బాలవెంకటేశ్వర్లు, ఉత్తమ నటిగా సురభి ప్రభావతి, ఉత్తమ నటుడిగా జి.శ్రీనివాసరెడ్డిలు ఎంపిక య్యారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి మలోల, సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు మైఖేల్ బాబు, సీనియర్ రంగస్థల నటుడు బాలాజీ నాయుడు, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు మహ్మద్ మియా, సంగా ఆంజనేయులు పాల్గొన్నారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జగదేక సుందరి సామా నాటకం చింతామణి నాటకాన్ని మైమరపించేలా నిలుస్తుందన్నారు. దివంగత నంది అవార్డు గ్రహీత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రాసిన ఈ నాటకానికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం కళాకారుల నాటకం జగదేక సుందరి సామా జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి, నాలుగు వ్యక్తిగత అవార్డులు దక్కించుకోవడం పట్ల జిల్లాకు చెందిన పలు సాహిత్య, కళాసంస్థల ప్రతినిధులు, కళాకారులు, కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.



'జగదేక సుందరి సామా' నాటకానికి జాతీయ బహుమతి అందుకుంటున్న కళారత్న పత్తి ఓబులయ్య

భార్యను చంపిన భర్త


శిరీష (ఫైల్)

నంద్యాల టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ఇంట్లో గొడవలు, ఇంటి వద్దకు అప్పులు వారు రావడం, అనుమానంతో భార్యను భర్త దారుణంగా కత్తితో పొడిచి చంపిన సంఘటన నంద్యాలలో మంగళవారం చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ అస్రర్ బాషా వివరాల మేరకు.. నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన శిరీష (45), సోమనాథశర్మ భార్యాభర్తలు. భర్త సోమనాథశర్మ ఆత్మకూరులోని ఓ దుకాణంలో అకౌంటెంటుగా పని చేస్తున్నారు. అయితే భార్యకు అప్పులు ఇచ్చిన వారు రోజూ ఇంటి వద్దకు వచ్చి గొడవ చేసేవారు. అలాగే ఆమె ప్రవర్తనపై కూడా అనుమానం కలిగిన భర్త హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం కాగా కుమారుడు కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కూతురు శ్రీహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీ.. బాలుడి మృతి


మహిధర్ (ఫైల్)

అవుకు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేసుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి మహిధర్ (3) ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని మంగళవారం మృతి చెందాడు. వివరాలివీ.. సుంకేసుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి శ్రీనివాసులు, వెంకట మీనాక్షి దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు సంతానం. రెండో కూతురు వెంకట రక్షిత కోవెలకుంట్లలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. స్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సులో రోజూ సుంకేసుల నుంచి కోవెలకుంట్లకు వెళ్లి వచ్చేది. అలాగే మంగళవారం ఉదయం శ్రీనివాసులు కూతురును స్కూల్ బస్సు ఎక్కించడానికి బస్సు వద్దకు వెళ్లారు. వీరి వెనుకనే బస్సు వద్దకు వచ్చిన బాలుడు మహిధర్ బస్సు ముందు భాగంలోకి వెళ్లాడు. బస్సు ముందు నిలబడిన బాలుడిని డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు కదిలించాడు. బస్సు ఢీకొనడంతో బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని స్కూల్ బస్సులోనే అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి వెల్లడించారు. అయితే స్కూల్ బస్సులో అటెండర్ లేకపోవడం, డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

పెద్దకడబూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. వగరూరుకు చెందిన ఖాదర్‌బాషా, తన తల్లి హసీనాతో ద్విచక్రవాహనంపై పెద్దకడబూరు మీదుగా వగరూరుకు వెళ్తున్నారు. ఈ సమయంలో చిన్నకడుబూరు గ్రామానికి చెందిన హనుమయ్య వాహనాన్ని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడ్డ హసీనాను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. హనుమయ్యకు రక్తగాయాల య్యాయి. హనుమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

డోన్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఈ ఘటన డోన్ పట్టణంలో మంగళవారం జరిగింది. డోన్ పట్టణంలోని వైఎస్ నగర్‌కు చెందిన దంపతులు రవితేజ, జయంతి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. తన భర్త తన సెల్‌ఫోన్‌ను దొంగలించాడని జయంతి డోన్ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఇంటి నుంచి వెళ్లిపోయారు. సీఐ ఇంతియాజ్ బాషా పర్యవేక్షణలో పోలీసులు హుటాహుటిన వెళ్లి పరిశీలించగా.. భర్త ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని అపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా.. పోలీసులు కిందకు దింపి ఆటోలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రవితేజ కోలుకుంటున్నాడు.

యువతి అదృశ్యం

బండిఆత్మకూరు సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకనూరు గ్రామానికి చెందిన 18 సంవత్సరాల యువతి మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆ యువతి తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు.

చదువుకోవాలని చెప్పినందుకు...

- ఉపాధ్యాయుడిపై దాడికి యత్నించిన విద్యార్థి

హొళగుంద, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలని మందలించడంతో ఉపాధ్యాయుడిపైనే ఓ విద్యార్థి సోమవారం దాడికి యత్నించాడు. వివరాల మేరకు.. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓ పదో తరగతి విద్యార్థి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంటంతో ఉపాధ్యాయుడు మందలించాడు. సందరు విద్యార్థి తరగతి గదిలోనే ఉపాధ్యాయుడి కాలర్ పట్టుకొని దాడికి యత్నించాడు. మిగతా ఉపాధ్యాయులు విద్యార్థిని బయటకు పంపివేశారు. కాగా సదరు విద్యార్థి ఉపాధ్యాయుడిపై దాడి చేసిన మొదటి విద్యార్థి నేనే నంటూ మొబైల్ ఫోన్‌లో స్టేటస్ పెట్టుకోవడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విద్యాబుద్ధులు నేర్పే టీచర్లప ఇలా వ్యవహరించడం తగతదని విద్యావేత్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై హెచ్ఎం కబీర్ సాబ్‌ను వివరణ కోరగా విద్యార్థి, ఉపాధ్యాయుడి కాలర్ పట్టుకున్న విషయం వాస్తవమేనని, సదరు విద్యార్థి తండ్రిని పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి, టీసీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ష్యూరిటీ పేరుతో మోసం చేశారు

- పోలీసులకు మహిళ ఫిర్యాదు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ష్యూరిటీ పెట్టేందుకు రావాలని పిలిపించి, మద్యం తాపించి బ్యాంకులో ఏకంగా తన భర్త పేరుపై రూ.6.95 లక్షలు లోను తీసుకున్నారని ఓ మహిళ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రుణం మొత్తంలో రూ.3.85 లక్షలు బ్యాంకులో రుణం చెల్లించి మిగతా రూ.3.10 లక్షలు తన అకౌంటుకు మళ్లించుకున్నారని ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాలివీ.. కోవెలకుంట్ల మండలంలోని గుల్లదుర్తి గ్రామానికి చెందిన మనోహ రమ్మకు నంద్యాల పట్టణానికి చెందిన తేజతో వివాహమైంది. వీరు నంద్యాలలో నివాసం ఉంటున్నారు. తేజ మున్సిపాలిటీలో ఉద్యోగం చేస్తున్నారు. నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐలో తేజ పేరు మీద రూ.6 లక్షలు పర్సనల్ లోన్ తీసుకున్నారు. ప్రతినెలా జీతం నుంచి డబ్బులు కట్ అయ్యేవి. సుమారు 3 లక్షలు అప్పు తీరింది. మరో 3 లక్షలు మిగిలింది. ఇటీవలనే తేజ సమీప బంధువులైన రాజేశ్, అతని స్నేహితుడు అబ్దుల్లా కలిసి పట్టణంలోని వేరొక బ్యాంకులో తేజ పేరు మీద రూ.6.95 లక్షలు తీయించి తేజకు ఎస్‌బీఐలో ఉన్న అప్పును క్లోజ్ చేయించారు. మిగతా డబ్బును వారు స్వాహా చేశారు. ఈ నెల డబ్బులు కట్ కాకపోవడంతో తేజ భార్య మనోహరమ్మ బ్యాంకు వెళ్లి విచారు. లోన్ మొత్తం క్లోజ్ అయిందని చెప్పడంతో అసలు విషయం బయటపడింది. ఈ విషయంపై భర్త తేజను అడిగారు. బ్యాంకులో షూరిటీ పెట్టాలని రాజేశ్, అబ్దుల్లా పిలిపించారని, లోన్ తీసుకున్నట్లు తెలియదని తేజ మనోహ రమ్మకు చెప్పారు. దీంతో మనోహరమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పని మనిషే ప్రాణం తీసింది..

- శివలీల హత్య కేసులో నిందితురాలి అరెస్టు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మూడో పోలీస్‌స్టేషన్ పరిధిలో సాయి వైభవ్ నగర్‌లో ఈనెల 1వ తేదీన జరిగిన కాటసాని శివలీల హత్య కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం మధ్యాహ్నం ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీబాబు ప్రసాద్, సీఐ లు శేషయ్య, చంద్రబాబునాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసు వివరా లను వెల్లడించారు. ఈహత్యకు కారణమైన ఆ ఇంట్లో పని చేసే కురువ వరలక్ష్మిని అరెస్టు చేశారు. వరలక్ష్మి కొద్ది కాలంగా శివలీల ఇంట్లో పని చేస్తుంది. శివలీల ఇంట్లో ఒంటరిగా ఉంటుందని భావించి తనకు డబ్బు అవసరం కాగా ఆమెను చంపి నగలు కాజేయాలని చూసింది. కొద్దికాలంగా ప్రణాళిక రూపొందించుకుంది. ఇటీవల ఆమెను పని నుంచి తొలగించేశారు. అయితే ఈ నెల 1వ తేదీన మరోసారి కాటసాని శివలీల ఇంటికి వచ్చి పనికి మరలా వస్తానని కోరింది. శివలీల వెనక్కు తిరిగి మాట్లాడుతుండగా.. ముందుగానే సిద్ధంగా ఉంచుకున్న రోకలి బండతో శివలీల తలపై కొట్టింది. దీంతో ఆమె కింద పడి పోగానే... మరో ఐదారుసార్లు బలంగా కొట్టింది. ఆమె కొనఊపిరితో ఉండగా.. ఆమె మెడ లోని బంగారు చైన్, నాలుగు గాజులు, బెడ్ రూంలో ఉన్న మరి కొంత నగదు తీసుకుని పరారైంది. దీంతో ఆరు చెక్‌బుక్కులు, ఏడు పాస్‌బుక్కులు కూడా తాను వెంట తీసుకెళ్లింది.

డీఎస్పీ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి..

పట్టపగలే శివలీల హత్య నగరంలో కలకలం సృష్టించింది. పోలీసులు ఈకేసును సీరి యస్‌గా తీసుకున్నారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐలు పలువురు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. మొదటగా దారిదోపిడీ దొంగలు అయింటారని భావించారు. ఆ సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎక్కడా అనుమానాస్పద వ్యక్తులు తారస పడలేదు. మరో వైపు హత్య జరిగిన తర్వాత కూడా ఆ ఇంట్లో నుంచి ఎవరూ బయటకు వచ్చిన దాఖలాలు కూడా కనిపించలేదు. సుమారు రాత్రి పొద్దుపోయే దాకా ఐదారు మంది సీఐలు, 25 మందికి పైగా కానిస్టేబుళ్లు ఈ కేసును పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. అదే రోజు రాత్రి ఓ సీసీ కెమెరాను పరిశీలిస్తే ఓ మహిళ ముఖానికి ముసుగు ధరించి అటు వైపు వెళ్తున్నట్లుగా గుర్తించారు. ఈ ఫొటోను మృతురాలి కూతురికి చూపించారు. ఆమె కూడా అనుమానంగా గుర్తించింది. పోలీసులు పనిమనిషి వరలక్ష్మి కోసం గాలించగా.. ఆమె పరారీలో ఉన్నట్లు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆమెను గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారిస్తే తానే హత్య చేసినట్లుగా నేరాన్ని అంగీకరించింది. ఆ తర్వాత తీసుకున్న సొత్తుతో హత్య చేశాక ఎవరికి అనుమానం రాకుండా వెనుకనుంచి గోడదూకి పరారైంది. దీంతో ఎక్కడా సీసీ కెమెరాల్లో కూడా నిందితురాలి జాడ కనిపించలేదు. చోరీ సొత్తును బంధువుల ఇళ్లలో దాచింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని చోరీ చేసిన సొత్తును మొత్తం స్వాధీనంచేసుకున్నారు. కేసు ఛేదించడంలో ప్రతిభ చూపిన హెడ్ కాని స్టేబుళ్ల శ్రీనివాసులు, జి.ప్రతాప్‌కుమార్, శేఖర్‌బాబు, జే.శేఖర్, చంద్రబాబు నాయుడు, పరమేశ్వరుడు, సమీర్, వీరబాబు, నాగరాజు, రాముడు, ఇబ్రహీంను ఎస్పీ అభినందించారు.


ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ

ఆ రోజు ఆమె ఎక్కడెక్కడికి వెళ్లింది

హత్య చేసిన రోజు నిందితురాలు తమ సొంతూరైన గోపాలనగరం వెళ్లి ఉదయం వితంతు పింఛన్ తీసుకుంది. డోన్ నుంచి కర్నూలుకు వచ్చింది. కర్నూలులో గుత్తి పెట్రోల్ బంకు వద్ద బస్సు దిగింది. అక్కడి నుంచి ఆటోలో రైతుబజారు వరకు వచ్చి అక్కడి నుంచి ముఖానికి మాస్కు ధరించి నేరుగా శివలీల ఇంటికి వెళ్లినట్లుగా గుర్తించారు.

ఆలయాలే టార్గెట్‌గా..

- హల్‌చల్ చేసిన దొంగలు
- తాళాలు పగలగొట్టారు
- హుండీలు ఎత్తుకెళ్లారు
- పోలీసుల ముమ్మర గాలింపు


మూలపెద్దమ్మ ఆలయంలో చోరీని పరిశీలిస్తున్న పోలీసులు

గడివేముల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలయాలే టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోయారు. మండలంలో మంగళవారం వేకువజామున దొంగలు హల్‌చల్ చేశారు. రోడ్డుపక్కన ఉన్న ఆలయాలను టార్గెట్ చేసి భక్తులు సమర్పించిన ముడుపులను అపహరించినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. వివరాలు.. వేకువజామున కొందరు దుండగలు బొలెరో వాహనంలో వచ్చి బూజనూరులో రోడ్డు పక్కన ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఆలయ గేటుకు ఉన్న తాళాన్ని పగలగొట్టారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. నందికొట్కూరు రహదారిలో వెళ్తూ గడివేములలో రోడ్డుపక్కన ఉన్న నూతన మూలపెద్దమ్మ ఆలయంలో ఇదే తరహా దోపిడీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించారు. హుండీ బరువుగా ఉండటంతో ఆలయంలో నుంచి బయటకు ఇడ్చుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో ఆలయం ముంగిట భక్తులు సమర్పించిన నాణేలు పడిపోయాయి. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి పూజలు చేసేందుకు ఆలయ అర్చకుడు వచ్చారు. ఆలయం ముంగిట నాణేలు పడిఉండటాన్ని గమనించారు. ఆలయంలోకి ప్రవేశించగా హుండీని ఈడ్చుకెళ్లిన ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీమ్‌ను పిలిపించి ఆనవాళ్లను సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించి దుండగలు వినియోగించిన వాహనాలను, వారు వెళ్లిన దారిని గుర్తించారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి బూజనూరు గ్రామ శివారులో పడవేసిన వేంకటేశ్వరస్వామి ఖాళీ హుండీని, గడివేముల గ్రామ శివారులో మూలపెద్దమ్మ ఆలయ హుండీని గుర్తించారు. మూలపెద్దమ్మ ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన నాణేలు, అమ్మవారికి సమర్పించిన వెండి ఆభరణాలు దొంగలు వదిలి వెళ్లినట్లు గుర్తించారు. మూలపెద్దమ్మ పూజారి చిన్నమాచర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మూలపెద్దమ్మ ఆలయంలో సుమారు రూ.1.50 లక్షలు, బూజనూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.30 వేలను దుండగలు అపహరించారని భక్తులు చర్చించుకుం టున్నారు.

రెండు హుండీలు పగలగొట్టి..

మంత్రాలయం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామంలో వెలసిన భీర లింగేశ్వరస్వామి, వీర నాగప్ప దేవాలయాల్లో రెండు హుండీలు గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టి నగదు, వెండి, మైక్ సెట్, ఇతర సామగ్రిని దోచుకెళ్లారు. ఈ చోరీ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మంగళవారం తెల్లవారుజామున జరిగి ఉండవచ్చని గ్రామస్థులు తెలుపుతున్నారు. గ్రామస్థులు, మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాలివీ.. భీర లింగేశ్వరస్వామి ఆలయంలో 50 కేజీల బరువున్న హుండీని ఎత్తుకెళ్లారు. దాదాపు హుండీలో రూ.50వేల నుంచి రూ.90వేల వరకు ఉండవచ్చని, ఈ హుండీని ప్రతి ఏడాది విజయదశమికి లెక్కిస్తామని భక్తులు చెబుతున్నారు. వీర నాగప్ప స్వామి ఆలయంలో హుండీని పగలకొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ప్రతి ఏడాది ఈ హుండీని లెక్కింపు మహాశివరాత్రి రోజున లెక్కింపు చేపడుతారని, ఇందులో రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు నగదు వస్తుందని తెలిపారు. మైకు సామగ్రి, మొక్కుబడుల కింద వచ్చిన వెండి, వివిధ ఆభర ణాలు సైతం అపహరించుకుని వెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయ పూజారులు వీరనాగుడు, రామాం జనేయులు దేవాలయం తలుపులు పగులకొట్టి ఉండటం చూసి మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంత్రాలయం సీఐ రామాంజులు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కర్నూలు నుంచి వచ్చిన క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. పూజారులు, సర్పంచ్ లింగారెడ్డి ఫిర్యాదు మేరకు రెండు హుండీల చోరీపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెద్ద పరిశ్రమతో పేద రైతు పోరాటం

- పరిశ్రమతో నిర్వీర్యమైన భూమి
- భూమి కొనుగోలు చేయాలని అల్ట్రాటెక్ ఫ్యాక్టరీతో పోరాటం
- కొనలేమంటున్న సిమెంట్ పరిశ్రమ


పాసుపుస్తకాలు చూపుతున్న తల్లి పేరం నాగమ్మ, రామచంద్రుడు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిమెంటు పరిశ్రమ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న అల్ట్రాటెక్ పరిశ్రమతో ఓ పేద రైతు ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నారు. పరిశ్రమ రాకతో బాధిత రైతు భూమిలో పంటలు పండిచుకోవడం, ఇంటి నిర్మాణము కూడా కష్టమే. దీంతో తన తల్లి పేరం నాగమ్మ పేరుపై ఉన్న 36 సెంట్లు భూమి కొనుగోలు చేయాలంటూ పోరాటం చేస్తున్నాడు కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లె గ్రామానికి చెందిన రైతు పేరం రామచంద్రుడు. కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామ సమీపంలో అనంతపురం జిల్లా సరిహద్దులో అల్ట్రాటెక్ పరిశ్రమ నెలకొని ఉంది. పరిశ్రమ కొంత భాగం నిర్మాణం అనంతపురం జిల్లాలో ఉన్నప్పటికీ, కొలిమిగుండ్ల మండలంలోని తుమ్మలపెంట, గొర్విమానుపల్లె, అంకిరెడ్డిపల్లె, బందార్లపల్లె, పెట్నికోట తదితర గ్రామాల మైనింగ్ భూములే ఆధారంగా పరిశ్రమ నడుస్తోంది. అల్ట్రాటెక్ దత్తత గ్రామమైన గొర్విమానుపల్లె గ్రామంలో పరిశ్రమ అవసరాల నిమిత్తం నిరంతరం భూముల కొనుగోలు ప్రక్రియ కొనసాగిస్తోంది. ఆయా గ్రామాల్లోని 80శాతం భూములను ఇప్పటికే పరిశ్రమ కొనుగోలు చేసింది. అయితే గొర్విమానుపల్లె గ్రామానికి చెందిన పేరం రామచంద్రుడు కుటుంబానికి సర్వేనెంబరు 892-5లో 36సెంట్లు భూమి ఉంది. ఈ భూమిని కొనుగోలు చేయాలంటూ అల్ట్రాటెక్ పరిశ్రమ అధికారుల వద్దకు కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోవడంలేదని రైతు పేరం రామచంద్రుడు వాపోతున్నారు. ఆ భూమి తమ మైనింగ్ లీజులో లేదని, అందుకే కొనలేమంటూ సదరు రైతుతో పాటు, తహసీల్దార్ కార్యాలయానికి సైతం అల్ట్రాటెక్ పరిశ్రమ లిఖిత పూర్వకంగా తెలియజేసింది. అయితే ఇదే సర్వే నెంబరుతో పాటు, దీని చుట్టూ ఉన్న 892, 893, 1088 తదితర అనేక సర్వే నెంబర్లలో పరిశ్రమ వారు భూములు కొనుగోలు చేశారు. దీనిని గమనిస్తే రైతుపై కక్ష సాధింపునకే ఇలా పరిశ్రమ వ్యవహరిస్తోందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మైనింగ్ లీజును సాకుగా చూపి పేద రైతులపై తమ నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. వాస్తవానికి మైనింగ్ లీజు అన్నది భూమి కొనుగోలు చేసిన తర్వాతే పరిశ్రమ వారికి లీజు పొందే హక్కు వస్తుందని మైనింగ్ అధికారులు వెల్లడిస్తున్నారు. గతంలో సైతం ఇదే కుటుంబానికి చెందిన 1088 సర్వే నెంబరులో 4.87ఎకరాల భూమి తమ లీజులో లేదని, కొనుగోలు చేయలేమని అల్ట్రాటెక్ అధికారులు చెప్పారు. దీంతో పేరం రామచంద్రుడు కుటుంబం ఆ భూమిని ఇతరులకు తక్కువ ధరకు విక్రయించారు. అయితే ఏడాదిన్నర వ్యవధిలోనే సదరు వ్యక్తి నుంచి అల్ట్రాటెక్ పరిశ్రమ అధిక ధర చెల్లించి ఆ భూమిని కొనుగోలు చేసింది. ఇలా అల్ట్రాటెక్ పరిశ్రమలో భూముల కొనుగోలు విభాగంలో పనిచేసే కొందరు అధికారులు పేద రైతులపై కక్ష సాధింపు చేస్తున్నారని రైతు రామచంద్రుడు వాపోతున్నాడు. చుట్టూ పరిశ్రమ భూములు, సమీపంలోనే మైనింగ్ పనులు జరుగుతుండటంతో భూమి సాగుకు కూడా అవకాశంలేకుండా పోయింది. తన 36సెంట్లు భూమి నిరుపయోగంగా మారిందని రైతు రామచంద్రుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తాను మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ అభిమానినని, తమ కుటుంబానికంతా టీడీపీ సభ్యత్వం ఉందన్నారు. తన కుటుంబం కష్టాల్లో ఉందని, ప్రభుత్వం న్యాయం చేయాలని రామచంద్రుడు కోరుతున్నారు.

పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలి

- వీసీలో పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ


వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జడ్పీ సీఈవో, డీపీవో

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జడ్పీలోని మినీ సమావేశ హాలులో జరిగిన ఈసమావేశంలో సీఈవో నాసరరెడ్డి, డీపీవో భాస్కర్, డివిజనల్, మండల పంచాయతీ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పంచాయతీల పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) కాల్ సర్వేలో సెప్టెంబరు నెల పరితీరును కమిషనర్ సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణ చేపట్టిన పనితీరులో జిల్లా స్థాయిలో మెరుగైన స్థితి కనబరిచిన ఐదు గ్రామ పంచాయతీలు ఐఈసీ యాక్టివిటీస్ గురించి కమిషనర్ ప్రశంసించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నతంగా పనులు చేపట్టాలన్నారు. జిల్లా స్థాయిలో చివరి స్థానంలో ఉన్న 10 గ్రామ పంచాయతీల పనితీరు మెరుగుపరడం కోసం పంచాయతీ కార్యదర్శులు, అధికారులు చేపట్టాల్సిన చర్యలను తెలిపారు.

కారుణ్య నియామకాలపై హర్షం


కలెక్టర్ రంజిత్ బాషాను కలిసిన ఎస్టీయూ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలు చేపట్టడంతో పశ్చిమ ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో పాటు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్దన్ మంగళవారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్ యాజమాన్యంలో పని చేస్తూ మరణించిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలు 86 మంది కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకోగా.. ఇందులో 36 మందికి జూనియర్ సహాయకులుగా కారుణ్య నియామకాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న మరో 50 మంది ఉన్నారనీ, గత ఐదు సంవత్సరాల నుంచి ఉద్యోగం లేక ఆర్థికంగా చిన్నాభిన్నం అవుతూ పిల్లల చదువులు, వివాహాలు అర్థాంతరంగా ఆగిపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. అయితే అర్హతలను సడలించి, మేనేజ్మెంట్‌తో సంబంధం లేకుండా కారుణ్య నియామకాలు సత్వరమే చేపట్టాలని కోరారు. జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఆలూరు, పత్తికొండ ప్రాంతాల్లో ప్రజలు వలసలు వెళ్తున్న కారణంగా వారితో పాటు బాలబాలికలు వలసలు వెళ్లకుండా విద్యార్థులు విద్యకు దూరం కాకుండా సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. కేజీబీవీలో, మోడల్ స్కూల్‌లో, సోషల్ వెల్ఫేర్, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సీట్లను పెంచాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారనితెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉపాధ్యాయ వాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబేగ్ తదితర ఉపాధ్యాయులు ఉన్నారు.

సమాన వేతనం అమలు చేయాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప



మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆశా వర్కర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.రమీజాబీ, ఏఐటీయూసీ నగర కార్య దర్శి జి.చంద్రశేఖర్,ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, కృష్ణమూర్తి, నాగవేణి, కొండమ్మ, పద్మ పాల్గొన్నారు.

చుక్క నీరు కరువాయె..!

- 2004లో సోమయాజులపల్లె చెరువు నిర్మాణం
- నేటికీ పొలాలకు అందని నీళ్లు
- కంప చెట్లతో దర్శనం ● రూ. కోటి దుర్వినియోగం



నీరు లేక వెలవెలబోతున్న చెరువు

ఓర్వకల్లు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లెలోని చెరువు చుక్కనీరు కూడా నేటికీ చేరలేదు. 2004లో అప్పులబాధ తాళలేక మృతి చెందిన కుటుంబాలకు పరిహారం అందించేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోమయాజులపల్లె గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులు గ్రామానికి ఎలాంటి సాగునీటి సౌకర్యం లేదని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన చెరువు నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేశారు. ఈ చెరువుకు ప్రధాని చెరువుగా గుర్తింపు వచ్చింది. పనులు అయితే త్వరగా పూర్తి చేశారు. సాగునీరు అందుతుందని రైతులు ఆనందం చెందారు. చెరువు నిర్మించినప్పటి నుంచి నేటికీ ఆ చెరువులో నీరు నిలవడం లేదు. సెంటు భూమికి కూడా నీరు అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు కింద 350 ఎకరాలకు సాగునీరు అందాలి. కానీ సెంటు భూమి కూడా నీరు అందలేదు. ఈచెరువు మరమ్మతుల కోసం మరో రూ.10లక్షలకు పైగా ఖర్చు చేశారు. చెరువు అంతా కంప చెట్లే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

ఏనాడూ నీరు అందలేదు



2004లో చెరువును నిర్మించారు. నేటి వరకు సోమయాజులపల్లె చెరువుకు ఎలాంటి సాగునీరు అందలేదు. చెరువు నిర్మిస్తే మా తలరాతలు మారుతాయనుకున్నాం. కానీ ఫలితం లేదు. నిధులేమో దుర్వినియోగమే.

● రామకృష్ణ, రైతు

హంద్రీనీవా నీటితో చెరువును నింపాలి



నన్నూరు గ్రామ సమీపాన వెళ్తున్న సుజలస్రవంతి హంద్రీనీవా ద్వారా చెరువుకు నీరు నింపాలి. అప్పుడు చెరువు కింద 350 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

● కాకి దేవేంద్ర, రైతు

రైతులకు అందుబాటులో యూరియా: ఏడీఏ

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు సబ్ డివిజన్‌లోని రైతులకు యూరియాను అందుబాటులో ఉందని కర్నూలు వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీవర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఏడీఏ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ డివిజన్‌లోని రైతు సేవా కేంద్రాల్లో 121.9 టన్నుల యూరియా ఉందని, ప్రైవేటు డీలర్స్ వద్ద 439 టన్నుల యూ రియా ఉందన్నారు. ఎవరైనా ఎక్కువ ధరను రైతుల వద్ద డిమాండ్ చేసినా, బోగస్ రైతుల పేరుతో పక్కదారి పట్టించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కర్నూలు మండలంలో ప్రైవేటు డీలర్ల వద్ద 77.73 టన్నుల యూరియా, కల్లూరు మండలంలో రైతు సేవా కేంద్రాల్లో 37.9 టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 47.36 టన్నుల యూరియా ఉందన్నారు. కోడుమూరు మండలంలో ప్రైవేటు డీలర్ల వద్ద 55 టన్నులు, గూడూరు మండలంలో రైతు సేవా కేంద్రాల్లో 4.275 టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 67.525 టన్నులు, సి.బెళగల్ మండలంలో రైతు సేవా కేంద్రాల్లో 54.8 టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 126.5 టన్నులు, ఓర్వకల్లు మండలంలో రైతు సేవా కేంద్రాల్లో 24.93 టన్నులు యూరియా ఉందన్నారు.

కేఎంసీ ఎంబీబీఎస్ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో కర్నూలు మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో యూనివర్సిటీ చాన్స్‌లర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన నిర్వహించిన 27, 28వ వార్షిక స్నాతకోత్సవంలో కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మెడల్స్, సర్టిఫికెట్లను అందుకున్నారు. 2023 ఎంబీబీఎస్ చివరి సంవత్సరం పరీక్షలో డాక్టర్లు పెరిగెళ్ల నమ్రత, కావూరి హైమావతి, కావూరి చలపతిరావులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారు. వీరికి గవర్నర్ అబ్దుల్ నజీర్ నేషనల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ న్యూఢిల్లీ చీఫ్ సిటీ సర్జన్ డాక్టర్ ఓపీ యాదవ, వైస్ చాన్సలర్ డా.పి.చంద్రశేఖర్ మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు. యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ చాటి మెడల్స్, సర్టిఫికెట్లు, అందుకున్న విద్యార్థులను కేఎంసీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ అభినందించారు.

సొసైటీ అధ్యక్షులకు సన్మానం

ఓర్వకల్లు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు సింగిల్ విండో అధ్యక్షుడు సుధాకర్‌రావు, నన్నూరు సింగిల్ విండో అధ్యక్షుడు నాగేశ్వర రెడ్డిలను ఓర్వకల్లులో రిటైర్డు వ్యవసాయాధికారి నాయకుడు అశోక రత్నం మంగళవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాంభూపాల్ రెడ్డి, రమణారెడ్డి, క్రిష్ణయ్య చౌదరి, సీఈవో మద్దిలేటి పాల్గొన్నారు.

శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం



పీబీవీ సుబ్బయ్యను సత్కరిస్తున్న జనసేన, ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల అధినేత, జనసేన నాయకుడు పీబీవీ సుబ్బయ్య ఇటీవల శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా మంగళవారం పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు. విద్యావేత్తగా పీబీవీ సుబ్బయ్యకు సముచిత గౌరవం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ఆయన స్వగృహంలో జనసేన, టీడీపీ నాయకులతోపాటూ కల్లూరు ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు పీబీవీ సుబ్బయ్యకు పూల మొక్కలు, జ్ఞాపిక అందజేసి శాలువలతో సత్కరించారు. పీబీవీ సుబ్బయ్య మాట్లాడుతూ 2014 నుంచీ జనసేన పార్టీలో కొనసాగుతున్నానని, తన సేవలను గుర్తించి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ తనకు పదవి కేటాయించారని అన్నారు. కార్యక్రమంలో ఎస్కే బాషా, స్వామీజీ, మధు, గంగాధర్ గౌడ్, శేఖర్, మల్లికార్జున, భాస్కర్, సుధాకర్, మద్దిలేటి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రాణించాలని న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎ.క్యాంపులో ఉన్న నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ టెన్నికాయిట్ పోటీలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచి క్రీడా సాధన చేయాలన్నారు. అనంతరం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసురెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు వరలక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభ చూపాలి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే పరేడ్ ఎంపికల్లో వర్సిటీ విద్యార్థులు ప్రతిభ చూపాలని రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన రిపబ్లిక్ పరేడ్ ఎంపికలను రెక్టార్ ఎ.వీకే నాయక్‌తో కలిసి నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల రీజినల్ డైరెక్టర్ ఎం రామకృష్ణ, కో-ఆర్డినేటర్ పి. నాగారాజు, ఎస్ నాగచంద్రుడు, వెంకటరత్నం, విజయుడు, శివకిషోర్ పాల్గొన్నారు.

పంట నమోదు చేయించాల్సిన బాధ్యత ఎంపీఈవోలదే

సి.బెళగల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉల్లి సాగు చేస్తున్న రైతులతో పంట నమోదు చేయించాల్సిన బాధ్యత ఎంపీఈవోలపై ఉందని కోడుమూరు ఉద్యాన శాఖాధికారి మదన్‌మోహన్ అన్నారు. మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏవో మల్లేష్ కుమార్, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

గూడూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి అన్నారు. మంగళవారం మండలంలోని కె.నాగలాపురం, పెంచికలపాడు గ్రామాల్లోని పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో ఉదయం విద్యార్థులకు ఇస్తున్న రాగి జావను పరిశీలించారు. ఆమె వెంట మండల విద్యాశాఖ అధికారి నాగరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జరీనా బాను ఉన్నారు.

ఆలయానికి విరాళం

గూడూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి నంద్యాల జిల్లా శ్రీనివాస నగర్‌కు చెందిన రవీంద్రా రెడ్డి, కవిత రెడ్డి దంపతులు రూ.11,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ సిబ్బంది కేశవ మంగళవారం తెలిపారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకున్నారు.

పార్కుకు తాళం ఎలా వేస్తారు?

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొండారెడ్డి బురుజు ఎదురుగా రూ.కోటితో నిర్మించిన పార్కుకు తాళం ఎలా వేస్తారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం కమిటీ సభ్యులు పాతబస్తీలోని రెండు పార్కులను సందర్శించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన పార్కులోకి వృద్ధులు, ప్రజలకు ప్రవేశం లేదా అని అన్నారు. పెద్ద మార్కెట్ సమీపంలోని పార్కు మద్యం ప్రియులకు అడ్డాగా మారిందన్నారు. సభ్యులు ఎం.హనుమంతరెడ్డి, జే.నాగభూషణం, సర్దార్, యూనుస్, టి.నాగరాజు పాల్గొన్నారు.

శేషయ్య మృతి పార్టీకి తీరని లోటు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జిల్లా నాయకుడు జేఎన్.శేషయ్య మృతి పార్టీకి తీరని లోటని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహులు అన్నారు. మంగళవారం శేషయ్య భౌతికకాయానికి ఆయన నివాసంలో సందర్శించి నివాళి అర్పించారు. నగేష్, ప్రభాకర్, రాధాక్రిష్ణ, జే.ఏసు, ఎస్.హుస్సేన్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సి.బెళగల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముడుమాల, పల్దొడ్డి, కొండాపురం, గుండ్రేవుల గ్రామాల్లో ఆయన పర్యటించి పరిసరాలను ఆయన వెంట ఎంపీడీవో రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి, సర్పంచులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో నేడు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు షరాఫ్‌బజార్, హెడ్ పోస్టాఫీస్, మున్సిపల్ స్కూల్ నుంచి కిడ్స్‌వరల్డ్ పార్క్ వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

హంద్రీలో ముళ్లపొదలు తొలగించండి

కల్లూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని 32వ వార్డు పరిధిలోని హంద్రీనదిలో ముళ్లపొదలు తొలగించాలని కేవీపీఎస్ వార్డు అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. మంగళవారం కేవీ పీఎస్ సభ్యుల బృందంతో ఆయన హంద్రినది పరిస రాలను పరిశీలించారు.

ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ

ఓర్వకల్లు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నమడకల గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.70 లక్షలతో 90వేల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్‌ఎస్ఆర్ వాటర్ ట్యాంకు నిర్మాణానికి మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసులు, ఓర్వకల్లు సింగిల్ విండో అధ్యక్షుడు సుధాకర్‌రావు, టీడీపీ నాయకుడు బొల్లవరం వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లా డుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకే వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ తిప్పన్న అధ్యక్షత వహించగా.. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరిత హాజరవుతారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో పదవో తరగతి చదువుతున్న తోటిరెడ్డి కీర్తిరెడ్డి సీబీఎస్ఈ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతిభ కనబరిచారు. ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో అమ్మిన్యు పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో రిడ్జ్ పాఠశాల విద్యార్థి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. రిడ్జ్ పాఠశాల సీఈవో గోపినాథ్ మాట్లాడుతూ తైక్వాండో ఆత్మరక్షణ కలుగుతుందన్నారు.

మంత్రిపై ఆరోపణలు తగదు



మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మలతారెడ్డి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో అనధికారికంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించడంలో మంత్రి టీజీ భరత్ పాత్ర ఉందని చేస్తున్న దుష్ప్రచారంలో వాస్తవం లేదని టీడీపీ కార్పొరేటర్లు పద్మలతారెడ్డి, క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు క్వార్టర్స్‌ను ఆక్రమించుకుని వాటిని అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారని, వారు తమస్వార్థ ప్రయోజనాల కోసం మంత్రిపై ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు డైరెక్టర్లు శ్రీధర్, పవన్ కుమార్, మారుతి శర్మ, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాజు యాదవ్, 22 వార్డు ఇన్‌చార్జి, న్యాయవాది శ్రీధర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పోస్టరును ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుధాకర్

కల్లూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నోరు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉండవచ్చునని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ అన్నారు. కల్లూరు మండలం ఎ.గోకులపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ నోటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నోటి ఆరోగ్యం బాగా లేకపోతే దంత, గుండె వ్యాధులతో పాటు మతిమరుపు కూడా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతిరోజు ఉదయం రాత్రి రెండుసార్లు దంతాలను శుభ్రం చేసు కోవాలన్నారు. హెచ్‌ఎం హనుమంతు ఉపాధ్యాయులు సుబ్బయ్య, చాముండేశ్వరి, సామాజిక ఆరోగ్య అధికారి చందన, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

కష్టాలున్నా.. హామీలు అమలు

(5వ పేజీ తరువాయి)

ఈ పథకం కింద ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు, రాష్ట్ర కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14 వేలు కలిపి రూ.20 వేలు 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం' ద్వారా మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ఖరీఫ్ ప్రారంభంలో తొలి విడత రూ.7 వేలు, రబీలో రెండవ విడత రూ.7 వేలు, వేసవిలో మూడవ విడత రూ.6 వేలు జమ చేస్తారు. తొలి విడత రూ.7 వేలు చొప్పున 2,72,552 మంది కష్టజీవుల ఖాతాల్లో రూ.136.38 కోట్లు ఇప్పటికే జమ చేశారు. ఈ నెల ఆఖరు లేదా అక్టోబరు మొదటి వారంలో రెండవ విడత రూ.7 వేలు జమ చేసేందుకు సన్నహాలు చేస్తున్నారు.

పింఛన్ పెంచెన్..



జిల్లాలో వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు ఎవరిని కదిపినా చంద్రన్న మా ఇంటి పెద్దకొడుకులా అండగా ఉన్నారంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ ఒకేసారి రూ.వెయ్యి పెంచి ఇవ్వడమే కాకుండా మూడు బకాయి కూడా కలిపి జూలై ఒకటో తేదీన చెల్లించారు. తర్వాత నెల నుంచి వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.6 వేలు చొప్పున పింఛన్ చెల్లిస్తున్నారు. జిల్లాలో 2,45,229 మంది వివిధ వర్గాల పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. నెలకు రూ.115-120 కోట్లు పంపిణీ చేస్తున్నారు. 4,851 మంది సచివాలయ సిబ్బంది తెల్లారకనే ఇంటి తలుపు తట్టి అందజేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.73.50 కోట్లు పింఛన్ పంపిణీ చేస్తే.. టీడీపీ కూటమి వచ్చాక రూ.41-45 కోట్లు అదనంగా లబ్ధి చేకూరుతుంది.

పేదల ఇంట దీపం వెలుగు



కూటమి ప్రభుత్వం రాగానే 'దీపం పథకం' పునఃప్రారంభిస్తాం.. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఇచ్చిన హామీ పక్కాగా అమలు చేస్తున్నారు. జిల్లాలో 6.40 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉంటే దీపం కింద 4.73 లక్షల మంది పేదలు నమోదు చేసుకున్నారు. వీరికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు.

ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు



రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చాలనే మహోన్నత ఆశయంతో 'అన్న క్యాంటీన్లు' ప్రారంభించి రూ.5లకే పౌష్టికమైన భోజనం వడ్డించారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసేసి నిరుపేదల కడుపుకొట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కర్నూలు నగరంలో 5, ఆదోనిలో 3, ఎమ్మిగనూరు పట్టణంలో 2 అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్నారు. పూటకు రూ.5లకే రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. పూటకు 5 వేల మంది చొప్పున రోజుకు 10 వేల మందికిపైగా పేదలు ఆకలి తీరుస్తున్నారు.

స్త్రీశక్తి పేరిట ఉచిత ప్రయాణం



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇది ఒకటి. ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం పేరిట ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో కర్నూలు-1, 2, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ ఆర్టీసీ డిపోల పరిధిలో వివిధ రూట్లలో రోజుకు సగటున 25-30 వేల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.45-50 కోట్లకు రాయితీ భరించాల్సి వస్తుంది. గ్రామాలకు వెళ్లి వివిధ చిల్లర వ్యాపారాలు చేసే మహిళలు, మహిళా ఉద్యోగులకు స్త్రీశక్తి కొండంత అండగా నిలుస్తుంది.

మెగా డీఎస్సీ-2025 వరం



రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడు లేని రీతిలో మెగా డీఎస్సీ-2025 నిర్వహించి నిరుద్యోగ యువతకు చేయూతగా కూటమి ప్రభుత్వం నిలిచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో వివిధ విభాగాల్లో 2,645 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. 53,787 మంది నిరుద్యోగ ఉపాధ్యాయులు దరఖాస్తులు చేశారు. పోటీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్లు ప్రకారం మెరిట్ జాబితా గత నెల 23న విడుదల చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తి చేశారు. ఇక్కో ఇంట్లో ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

మా ఇంట్లో ఐదుగురికి తల్లికి వందనం



మాకు నలుగురు కూతుళ్లు, కొడుకు ఐదుగురు సంతానం. స్థానిక జడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో పెద్ద కూతురు, జేబీఎం పాఠశాలలో మరో నలుగురు ప్లిలు చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.13 వేలు ప్రకారం ఐదుగురు పిల్లలకు రూ.65 వేలు సీఎం చంద్రబాబు ఖాతాలో జమ చేశారు. మా కష్టాలు తీరిపోయాయి.

● బెళగల్ నరసమ్మ, ఈరన్న దంపతులు, కోసిగి

రూ.7 వేలు ఖాతాలో వేశారు



మాకు ఐదు ఎకరాల పొలం ఉంది. వివిధ పంటలు సాగు చేస్తున్నాను. ఖరీఫ్ ప్రారంభంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.7 వేలు తొలి విడత డబ్బులు వేశారు. పెట్టుబడికి ఎంతో సాయం అయ్యింది. మరో రూ.13 వేలు రెండు విడతల్లో వేస్తారని అధికారులు చెప్పారు.

● పి.సిద్ధిక్‌సాబ్, రైతు, హొళగుంద

కష్టాలున్నా.. హామీలు అమలు

(5వ పేజీ తరువాయి)

ఈ పథకం కింద ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు, రాష్ట్ర కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14 వేలు కలిపి రూ.20 వేలు 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం' ద్వారా మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ఖరీఫ్ ప్రారంభంలో తొలి విడత రూ.7 వేలు, రబీలో రెండవ విడత రూ.7 వేలు, వేసవిలో మూడవ విడత రూ.6 వేలు జమ చేస్తారు. తొలి విడత రూ.7 వేలు చొప్పున 2,72,552 మంది కష్టజీవుల ఖాతాల్లో రూ.136.38 కోట్లు ఇప్పటికే జమ చేశారు. ఈ నెల ఆఖరు లేదా అక్టోబరు మొదటి వారంలో రెండవ విడత రూ.7 వేలు జమ చేసేందుకు సన్నహాలు చేస్తున్నారు.

పింఛన్ పెంచెన్..



జిల్లాలో వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు ఎవరిని కదిపినా చంద్రన్న మా ఇంటి పెద్దకొడుకులా అండగా ఉన్నారంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ ఒకేసారి రూ.వెయ్యి పెంచి ఇవ్వడమే కాకుండా మూడు బకాయి కూడా కలిపి జూలై ఒకటో తేదీన చెల్లించారు. తర్వాత నెల నుంచి వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.6 వేలు చొప్పున పింఛన్ చెల్లిస్తున్నారు. జిల్లాలో 2,45,229 మంది వివిధ వర్గాల పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. నెలకు రూ.115-120 కోట్లు పంపిణీ చేస్తున్నారు. 4,851 మంది సచివాలయ సిబ్బంది తెల్లారకనే ఇంటి తలుపు తట్టి అందజేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.73.50 కోట్లు పింఛన్ పంపిణీ చేస్తే.. టీడీపీ కూటమి వచ్చాక రూ.41-45 కోట్లు అదనంగా లబ్ధి చేకూరుతుంది.

పేదల ఇంట దీపం వెలుగు



కూటమి ప్రభుత్వం రాగానే 'దీపం పథకం' పునఃప్రారంభిస్తాం.. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఇచ్చిన హామీ పక్కాగా అమలు చేస్తున్నారు. జిల్లాలో 6.40 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉంటే దీపం కింద 4.73 లక్షల మంది పేదలు నమోదు చేసుకున్నారు. వీరికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు.

ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు



రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చాలనే మహోన్నత ఆశయంతో 'అన్న క్యాంటీన్లు' ప్రారంభించి రూ.5లకే పౌష్టికమైన భోజనం వడ్డించారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసేసి నిరుపేదల కడుపుకొట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కర్నూలు నగరంలో 5, ఆదోనిలో 3, ఎమ్మిగనూరు పట్టణంలో 2 అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్నారు. పూటకు రూ.5లకే రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. పూటకు 5 వేల మంది చొప్పున రోజుకు 10 వేల మందికిపైగా పేదలు ఆకలి తీరుస్తున్నారు.

'స్త్రీ శక్తి' పేరిట ఉచిత ప్రయాణం



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇది ఒకటి. ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం పేరిట ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో కర్నూలు-1, 2, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ ఆర్టీసీ డిపోల పరిధిలో వివిధ రూట్లలో రోజుకు సగటున 25-30 వేల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.45-50 కోట్లకు రాయితీ భరించాల్సి వస్తుంది. గ్రామాలకు వెళ్లి వివిధ చిల్లర వ్యాపారాలు చేసే మహిళలు, మహిళా ఉద్యోగులకు స్త్రీశక్తి కొండంత అండగా నిలుస్తుంది.

మెగా డీఎస్సీ-2025 వరం



రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడు లేని రీతిలో మెగా డీఎస్సీ-2025 నిర్వహించి నిరుద్యోగ యువతకు చేయూతగా కూటమి ప్రభుత్వం నిలిచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో వివిధ విభాగాల్లో 2,645 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. 53,787 మంది నిరుద్యోగ ఉపాధ్యాయులు దరఖాస్తులు చేశారు. పోటీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం మెరిట్ జాబితా గత నెల 23న విడుదలు చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తి చేశారు. ఇక్కో ఇంట్లో ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కప్పట్రాళ్ల వంటి ఫ్యాక్షన్ గ్రామంలో ఏకంగా ఎనిమిది మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఆ గ్రామ చరిత్రలోనే ఓ రికార్డు.

మా ఇంట్లో ఐదుగురికి తల్లికి వందనం



మాకు నలుగురు కూతుళ్లు, కొడుకు ఐదుగురు సంతానం. స్థానిక జడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో పెద్ద కూతురు, జేబీఎం పాఠశాలలో మరో నలుగురు పిల్లలు చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.13 వేలు ప్రకారం ఐదుగురు పిల్లలకు రూ.65 వేలు సీఎం చంద్రబాబు ఖాతాలో జమ చేశారు. మా కష్టాలు తీరిపోయాయి.

- బెళగల్ నరసమ్మ, ఈరన్న దంపతులు, కోసిగి

● రూ.7 వేలు ఖాతాలో వేశారు



మాకు ఐదు ఎకరాల పొలం ఉంది. వివిధ పంటలు సాగు చేస్తున్నాను. ఖరీఫ్ ప్రారంభంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.7 వేలు తొలి విడత డబ్బులు వేశారు. పెట్టుబడికి ఎంతో సాయం అయ్యింది. మరో రూ.13 వేలు రెండు విడతల్లో వేస్తారని అధికారులు చెప్పారు.

- పి.సిద్ధిక్‌సాబ్, రైతు, హొళగుంద

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్త, మూడు ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో లలిత ప్రకటనలో తెలిపారు. పత్తికొండ పరిధిలోని మరిమాన్‌తండాలో కార్యకర్త పోస్టు, బొందిమడుగుల, పందికోన, జె.ఎం.తండాలో ఆయా పోస్టులు ఉన్నాయన్నారు. కార్యకర్తకు పదో తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. 01-07-2025 నాటికి 21 సంవత్సరాలు నిండి, 35 సంవత్సరాల్లోపు వయస్సు కలిగి, వివాహితులై స్థానికంగా ఉండాలన్నారు. 17వ తేదీన సాయంత్రం 5 గంటల్లోపు సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

ఆదోని రూరల్: పట్టణంలో నిజాముద్దీన్ కాలనీ-2లో అంగన్‌వాడి ఆయా(బీసీ-డి), కార్వన్‌పేట దుల్హన్‌బావి-2 (ఈడబ్ల్యూఎస్), రూరల్ పరిధిలో మదిరె సెంటర్-2ఓసి) ఆరేకల్లు సెంటర్-2(బీసీడీ), పెద్దహరివాణం-2(ఎస్సీ), నెట్టేకల్-1(బీసీడి) పాండవగల్లులో బీసీఏ ఖాళీలు ఉన్నాయని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కోరారు. జాలిమంచి -2లో అంగన్‌వాడి కార్యకర్త(ఓసికి) రిజర్వు చేశామన్నారు.

వైద్యశాలలో ప్రసవం చేయాలి



మాట్లాడుతున్న డా.శ్రీలక్ష్మి

మద్దికెర సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలోనే ప్రసవాలు అయ్యేలా ఆశా కార్యకర్తలు చూడాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి సూచించారు. మంగళవారం వైద్యశాలలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి నెల 9వ తేదీన గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీని వల్ల మాతా శిశు మరణాలు నివారించవచ్చని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని, రక్తహీనతకు గురి కాకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దామని, లింగనిర్ధారణ పరీక్షలు నేరమని హెచ్చరించారు. సీహెచ్‌వో నిరంజన్‌బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన వైకుంఠం జ్యోతి

దేవనకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి డీఎస్సీలో ఎంపికైన పదిమంది నూతన ఉపాధ్యాయులను టీడీపీ నాయకురాలు వైకుంఠం జ్యోతి సన్మానించారు. మంగళవారం పి.కోటకొండ గ్రామంలో మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని సూచించారు. కన్వీనర్ విజయబాస్కర్ ఉన్నారు.

హొళగుందకు ఢిల్లీ పోలీస్

హొళగుంద, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వందవాగిలి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై ఢిల్లీలో ఓ కేసు నమోదైంది. దీంతో ఢిల్లీలోని పర్వతాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ అశ్విన్ మంగళవారం హొళగుందకు వచ్చారు. ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌కు కేసుకు సంబంధించి అరెస్టు వారంట్‌ను అందజేశారు. స్పందించిన హొళగుంద పోలీసులు నిందితుడిని హెడ్ కానిస్టేబుల్‌కు అప్పగించారు. నిందితుడు తన తరఫు న్యాయవాది ద్వారా హెడ్ కానిస్టేబుల్‌తో మాట్లాడించి కేసు కోర్టులో ఉందని వివరాలను చెప్పడంతో సదరు హెడ్ కానిస్టేబుల్ తిరిగి ఢిల్లీకి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.



ఢిల్లీ కానిస్టేబుల్ అశ్విన్

వంద పడకల ఆసుపత్రిగా మార్చాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బందిని నియమించాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రంగారెడ్డి, సీఐటీయూ కార్యదర్శి రవిచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఆసుపత్రికి రోజూ వందలాది రోగులు వస్తుంటారని, ఏడుగురు వైద్యులు అవసరం కాగా, ఇద్దరు మాత్రమే ఉన్నారని, రోగులకు వైద్యం ఎలాఅందుతుందని ప్రశ్నించారు. ప్రతినెలా 9వ తేదీన గర్భిణులు పరీక్షల కోసం వస్తున్నారని, వైద్యులు లేకపోవడంతో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నరసన్న, బుజ్జులు, కాశన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడండి

మద్దికెర సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను వాడాలని ఏవో రవి సూచించారు. మంగళవారం రైతులకు నానో యూరియాను పంపిణీ చేశారు. మండలానికి 25 టన్నుల యూరియా, నానో యూరియా 1,270 లీటర్లు వచ్చిందన్నారు. యూరియా బస్తా రూ.267లు, నానో యూరియా లీటరు రూ.165 ప్రకారం ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. అధిక మోతాదులో ఎరువులు వాడితే భూసారం దెబ్బతింటుందన్నారు. రైతులు నానో యూరియా వాడితే పంటలకు పోషకాలు అందుతాయన్నారు. సిబ్బంది బోజరాజు, రమేష్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విరమించుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాల ప్రైవేటీకరణను విరమించు కోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీ నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. పీపీపీ పద్ధతిలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటుకు అప్పగించాలని క్యాబినేట్ సమావేశంల్లో తీర్మానించడం అన్యాయమన్నారు. సామెల్ రామలింగయ్య, శాంతిరాజు, బంగారప్ప, ఫయాజ్ భాష, కౌలుట్లయ్య బాలు, ఏసన్న, లింగప్ప, అక్బర్, అబ్రహాం పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

రైతును దగా చేసిన ప్రభుత్వం

● ఆదోని, పత్తికొండలో వైసీపీ 'అన్నదాత పోరు'



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు



పత్తికొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులను దగా చేసిందని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక ఆరోపించారు. మంగళవారం ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల నాయకులు ఆదోనిలో ర్యాలీ నిర్వహించారు. ఖరీఫ్‌లో రైతులకు ఎరువులను సక్రమంగా పింపిణీ చేయడం లేదని ఆరోపించారు. యూరియా కొరతతో రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడానికే చూస్తోందన్నారు. ఉల్లి రైతుకు గిట్టుబాటు లేక పొలాల్లోనే వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మంత్రాలయం నాయకుడు ప్రదీప్ రెడ్డి, ఎమ్మిగనూరు మాజీ ఇన్‌చార్జి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, దేవా, లోకేశ్వరి, గుర్నాథ్ రెడ్డి, శేశిరెడ్డి ఫయాజ్, నాగరాజు పాల్గొన్నారు.

● రైతు పోరులో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మాట్లాడుతుండగా కళ్లు తిరిగి పక్కకు ఒరిగారు. కార్యకర్తలు అప్రమత్తమై నీడలోకి తీసుకెళ్లి నీళ్లు తాపారు

రైతులను ఆదుకోలేని ప్రభుత్వం

పత్తికొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోలేక చేతగాని ప్రభుత్వంగా మారిందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి విమర్శించారు. మంగళవారం పట్టణంలోని అన్నదాత పోరు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి నాలుగు స్తంభాల కూడలి నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్డీవో భరత్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు ప్రదీప్‌రెడ్డి, పరిశీలకుడు సురేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి శశికళ, ఎంపీపీ నారాయణదాసు, శ్రీరంగడు, రామచంద్ర, సోమశేఖర్ పాల్గొన్నారు.

కాలువలో పైపులైన్లు

తుగ్గలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామంలో తాగునీటి పైపులు మురుగు కాలువలో ఏర్పాటు చేశారు. దీంతో నీరు కలుషితమై ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. గ్రామంలో 500 కుటుంబాలు ఉండగా, 1,800 మంది నివసిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పైపులు లీకేజీ కావడంతో కలుషితమైపోయింది. ఆ నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నామని అధికారులు స్పందించి, పైపులైన్లను మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రాంపురంలో కాలువలో ఉన్న పైపులైన్

బడుగుల అభ్యున్నతికి సీఎం కృషి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని టీడీపీ నాయకుడు ఎస్.సి.శివప్రకాష్ అన్నారు. మంగళవారం మాట్లడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేశారన్నారు. రూ.4 వేలు పింఛన్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ్నాన అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు.

నీటిపథకం వద్ద మద్యం సీసాలు

హాలహర్వి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పథకాల వద్ద అసాంఘిక కార్యకలాపాలపై ఎంపీడీవో వరలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుద్ధి చేయని తాగునీరు వదులుతున్నాని ఫిర్యాదు రావడంతో బాపురం ఫిబెడ్స్‌ను పరిశీలించారు. అయితే అక్కడ మద్యం సీసాలు కనిపించడంతో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిపై మండిపడ్డారు. వెంటనే హాలహర్వి ఎస్ఐ మారుతికి ఫిర్యాదు చేశారు.

వంతెనకు మరమ్మతులు

ఆస్పరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమాన్‌దొడ్డి బస్టాండ్ సమీపంలో శిథిలమైన వంతెనకు అధికారులు మర్మతులు చేశారు. ఆగస్టు 20వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'భయం భయంగా' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ ఏఈ సునీల్ స్పందించి మరమ్మతులు చేయించారు. 58/2 కి.మీ. వద్ద మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు.



మరమ్మతుల అనంతరం ఇలా..

అభివృద్ధి పనులపై ఆడిట్

ఆలూరు(చిప్పగిరి), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో చేసిన అభివృద్ధి పనులపై జిల్లా జూనియర్ ఆడిట్ కరిముల్లా హుసేన్, జూనియర్ ఆడిట్ శ్రీకాంత్ ఆడిట్ నిర్వహించారు. మంగళవారం చిప్పగిరి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల ఎంబుక్, రికార్డులను తనిఖీ చేశారు.

13 మందిపై కేసు

హొళగుంద, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లార్తి గ్రామానికి చెందిన 13 మందిపై బైండర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఉరుసు నేపథ్యంలో ముందు జాగ్రత్తగా బైండోవర్ చేసి తహసీల్దార్ సమక్షంలో హాజరుపరిచామన్నారు. అనంతరం స్వంత పూచికత్తుపై విడుదల చేశమని, గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

శేషయ్య మృతి తీరనిలోటు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని సందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జీఎన్ శేషయ్య (70) మృతి తీరనిలోటని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప, కార్యదర్శి చక్రపాణి యాదవ్ అన్నారు. కర్నూలు బాలోత్సవ వేడుకల నిర్వహణలో కీలకంగా పని చేశారన్నారు. 2020 బాలోత్సవ వేడుకలను భుజస్కందాలపై వేసుకొని విజయవంతం చేశారని ఆయన మృతిని ప్రజా సంఘాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు.

ఆలయ చైర్మన్‌గా పారా రవికుమార్

మద్దికెర సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి రంగనాథ స్వామి ఆలయ చైర్మన్‌గా పారా రవికుమార్ ఎంపికయ్యారు. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు అందినట్లు ఈవో వీరయ్య తెలిపారు. దర్మకర్తలుగా నెట్టికంటయ్య, వెంకటగిరి లక్ష్మిదేవి, మహాలక్ష్మి, ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, నాగప్ప, గోపాల్‌తో పాటు ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా అర్చకుడు రంగస్వామి ఎంపిక చేశారన్నారు.



ఇసుక దోపిడీ విషయం సీఎం దృష్టికి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇసుక దోపిడీని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకతానని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం టిప్పర్ల యజమానులు ఎమ్మెల్యేను కలిశారు. మంత్రాలయం నియోజకవర్గంలోని రీచ్‌లలో ఇసుక దోపిడీని ఎమ్మెల్యే పార్థసారథికి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కోసమే సీఎం ఉచిత ఇసుకను ప్రవేశపెట్టార న్నారు. జిల్లాలో ఇసుక దోపిడీనికి ఇదివరకే సబ్‌కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని, వినతి పత్రం ఇచ్చానన్నారు. అసెంబ్లీలో ప్రస్తావించి, సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నర్సులు

బకాయిలు చెల్లించాలి

ఆదోని టౌన్/రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులకు బకాయిలను చెల్లించాల ని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతికు వినతిపత్రం ఇచ్చారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు లీలావతి, కార్యదర్శి బంగారి, కోశాధికారి లక్ష్మి మాట్లాడుతూ కొంతకాలంగా చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఈనెల 13 తేదీన కర్నూలు జనరల్ ఆసుపత్రిలో సమావేశం ఏర్పాటు చేశామని, రెండు జిల్లా నర్సులు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అస్వస్థత

● సీడీపీవో వేధింపులే కారణమని ఆరోపణలు



చికిత్స పొందుతున్న కార్యకర్త భువనేశ్వరి

ఆలూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురువల్లి గ్రామ అంగన్‌వాడీ కార్యకర్త భువనేశ్వరి మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సీడీపీవో నరసమ్మ వేధింపుల కారణంగానే తీవ్ర అస్వస్థతకు గురైనట్లు భర్త నెట్టప్ప ఆరోపించారు. సీడీపీవో తరచుగా వేధింపులకు గురి చేస్తుందని సమావేశంలో అందరి ముందు అవమానించారన్నారు. కార్యకర్త భువనేశ్వరి మాట్లాడుతూ సీడీపీవో తన నుంచి రూ.4వేలు డిమాండ్ చేసిందని ఆరోపించారు. ఈ విషయమై సీడీపీవో నరసమ్మ మాట్లాడుతూ విధి నిర్వహణలోనే మందలించానని ఉద్దేశపూర్వకంగా వేధించలేదన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

పత్తికొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేకాట స్థావరంపై దాడులు చేసి 50 మందిని అరెస్టు చేశామని సీఐ జయన్న తెలిపారు. సోమవారం అర్ధరాత్రి దాటాక బండిగేరి ప్రాంతంలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు తమ పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. మూడు బృందాలుగా అందర్ బహార్ ఆడుతున్న 50 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 3 బైకులు, 40 సెల్ ఫోన్లతో పాటు రూ.1.40 లక్షలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమల దేవి



పత్తికొండలో గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న గంజిమలదేవి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ పాటించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమల దేవి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని రేషన్ దుకాణాలు, హాస్టళ్లు, గురుకుల పాఠశాల, సివిల్ సప్లై గోదామును తనిఖీ చేశారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు.

తుగ్గలి: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమల దేవి సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి, రోగులు, వైద్యులతో మాట్లాడారు. ప్రభుత్వం వైద్య సిబ్బందిని నియమించి, పరికాలను కూడా ఏర్పాటు చేసిందన్నారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా రోజూ వైద్యశాలకు వచ్చి రోగులకు సేవలు అందించాలన్నారు. వైద్యులు అమర్‌నాథ్, రోజారమణి, ప్రవీణ ఉన్నారు.

దేవనకొండ: స్థానిక 6వ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక వైద్యశాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో స్టాకు వివరాలు, పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ విజయ, ఈవో రాజేశ్వరి, సీడీపీవో మద్దమ్మ, తహసీల్దార్ రామాంజినేయులు, వైద్యాధికారి విజయబాస్కర్, సూపర్ వైజర్లు శివలింగమ్మ, చందన, తదితరులు ఉన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతల రోడ్లను మరమ్మతులు చేపట్టాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయన్నారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎద్దుల మార్కెట్‌కు వెళ్లే రోడ్డు, పూల అంగళ్ల దగ్గర నుంచి సున్నపు బట్టి వంక వరకు, మహబూబ్‌నగర్ కాలనీ నాగిరెడ్డి పెట్రోల్ బంక్ దగ్గర, గాంధీనగర్‌లోని రోడ్ల దుస్థితి దారుణంగా ఉందన్నారు. అలాగే ఎదురు బసవన్న గుడి నుంచి ఎంబీ చర్చి వెళ్లే రోడ్డుకు కంకర వేసి నెలలు కావస్తున్నా పనులు పూర్తి కాలేదన్నారు. వ్యవసాయ మార్కెట్ నుంచి వడ్డేకేరప్ప వంక వరకు రోడ్డులో ప్రయా ణించాలంటేనే నరకయాతనగా ఉందన్నారు. పట్టణంలోని గుంతలు గుంతలుగా ఉన్న రోడ్లను మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో జయన్న, కిష్టన్న, నాగరాజు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్సిపల్ కాంట్రాక్టర్లు చేసిన పనులకు చెల్లించాల్సిన రూ. ఐదుకోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మిగనూరు మున్సిపల్ కాంట్రాక్టర్లు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది క్రితం పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైన్లు, బీటీ రోడ్లు, కల్వర్టులు, పైప్ లైన్ పనులు చేశామన్నారు. 20మంది కాంట్రాక్టర్లకు దాదాపు రూ.5 కోట్లకు పైగా డబ్బులు రావాల్సి ఉందన్నారు. ఏడాది కాలం దాటినా బిల్లులు విడుదల కాకపోవటంతో ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రస్తుతం చేపట్టాల్సిన పనులు నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు సీతారామిరెడ్డి, తిమ్మరాజు, నాగరాజు, సత్యనారాయణరెడ్డి, రామలింగప్ప, యూసుఫ్, భీమన్న, రాజేంద్ర, హనుమన్న, మద్దిలేటి, వీరేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనాన్ని నిర్మించాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం నిర్మించాలని, బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌తో కలిసి దళితుల ఆత్మీయ సమ్మేళన సభ కర పత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకు బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీలకతీతంగా జరిగే దళితుల ఆత్మీయ సమ్మేళ న సభకు అన్ని సామాజిక వర్గాలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరెకంటి భాస్కర్, సుమాల ఆంథోని, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

గరుసు తవ్వకాలు సాగిస్తే కఠిన చర్యలు

కొతిగట్టు కొండను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా కొండల్లో, ప్రభుత్వ స్థలాల్లో ఎర్ర గరుసును అక్రమంగా తవ్వి తరలించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శేషఫణి హెచ్చరించారు. మండలంలోని గుడికల్ సమీపంలో ఉన్న 'కోతిగట్టు కొండను తవ్వేస్తున్నారు' అంటూ 'ఆంధ్రజ్యోతి' మంగళవారం కథనాన్ని ప్రచురించింది. దాంతో స్పందించిన తహసీల్దార్ శేషఫణి, ఆర్ఐ హఫీజ్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఎర్రగరుసు తవ్విన కొతిగట్టును పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా గరుసు తవ్వకాలు సాగించేవారిపై దృష్టి సారించాలని స్థానిక గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. మరోసారి తవ్వకాలు సాగించకుండా ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్లను సీజ్ చేస్తామన్నారు. తహసీల్దార్ వెంట వీఆర్వో వరలక్ష్మి, సచివాలయం సిబ్బంది, వీఆర్ఏ నరసప్ప ఉన్నారు. కాగా, గరుసు తవ్వకాలు సాగించిన అక్రమార్కులపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.


గరుసు తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషఫణి

తప్పుడు ప్రచారం మానుకోవాలి: టీడీపీ

గోనెగండ్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత ఉందంటూ వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారం మానుకోవాలని హెచ్ కైరవాడి సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి సూచించారు. మంగళవారం హెచ్ కైరవాడి సహకార సంఘం గోడౌన్‌లో యూరియా స్టాక్‌ను టీడీపీ నాయకులు గురునాథ్‌రెడ్డి, రాజేష్ నాయుడు, రఘుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులకు కావాల్సినంత యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. వైసీపీ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించేందుకు ఈలాంటి ప్రచారం చేస్తున్నారని, వీటిని మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, పెద్దయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టాలున్నా.. హామీలు అమలు

(5వ పేజీ తరువాయి)

ఈ పథకం కింద ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు, రాష్ట్ర కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14 వేలు కలిపి రూ.20 వేలు 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం' ద్వారా మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ఖరీఫ్ ప్రారంభంలో తొలి విడత రూ.7 వేలు, రబీలో రెండవ విడత రూ.7 వేలు, వేసవిలో మూడవ విడత రూ.6 వేలు జమ చేస్తారు. తొలి విడత రూ.7 వేలు చొప్పున 2,72,552 మంది కష్టజీవుల ఖాతాల్లో రూ.136.38 కోట్లు ఇప్పటికే జమ చేశారు. ఈ నెల ఆఖరు లేదా అక్టోబరు మొదటి వారంలో రెండవ విడత రూ.7 వేలు జమ చేసేందుకు సన్నహాలు చేస్తున్నారు.

పింఛన్ పెంచెన్..



జిల్లాలో వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు ఎవరిని కదిపినా చంద్రన్న మా ఇంటి పెద్దకొడుకులా అండగా ఉన్నారంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ ఒకేసారి రూ.వెయ్యి పెంచి ఇవ్వడమే కాకుండా మూడు బకాయి కూడా కలిపి జూలై ఒకటో తేదీన చెల్లించారు. తర్వాత నెల నుంచి వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.6 వేలు చొప్పున పింఛన్ చెల్లిస్తున్నారు. జిల్లాలో 2,45,229 మంది వివిధ వర్గాల పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. నెలకు రూ.115-120 కోట్లు పంపిణీ చేస్తున్నారు. 4,851 మంది సచివాలయ సిబ్బంది తెల్లారకనే ఇంటి తలుపు తట్టి అందజేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.73.50 కోట్లు పింఛన్ పంపిణీ చేస్తే.. టీడీపీ కూటమి వచ్చాక రూ.41-45 కోట్లు అదనంగా లబ్ధి చేకూరుతుంది.

పేదల ఇంట దీపం వెలుగు




కూటమి ప్రభుత్వం రాగానే 'దీపం పథకం' పునఃప్రారంభిస్తాం.. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఇచ్చిన హామీ పక్కాగా అమలు చేస్తున్నారు. జిల్లాలో 6.40 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉంటే దీపం కింద 4.73 లక్షల మంది పేదలు నమోదు చేసుకున్నారు. వీరికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు.

ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు



రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చాలనే మహోన్నత ఆశయంతో 'అన్న క్యాంటీన్లు' ప్రారంభించి రూ.5లకే పౌష్టికమైన భోజనం వడ్డించారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసేసి నిరుపేదల కడుపుకొట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కర్నూలు నగరంలో 5, ఆదోనిలో 3, ఎమ్మిగనూరు పట్టణంలో 2 అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్నారు. పూటకు రూ.5లకే రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. పూటకు 5 వేల మంది చొప్పున రోజుకు 10 వేల మందికిపైగా పేదలు ఆకలి తీరుస్తున్నారు.

'స్త్రీ శక్తి' పేరిట ఉచిత ప్రయాణం



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇది ఒకటి. ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం పేరిట ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో కర్నూలు-1, 2, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ ఆర్టీసీ డిపోల పరిధిలో వివిధ రూట్లలో రోజుకు సగటున 25-30 వేల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.45-50 కోట్లకు రాయితీ భరించాల్సి వస్తుంది. గ్రామాలకు వెళ్లి వివిధ చిల్లర వ్యాపారాలు చేసే మహిళలు, మహిళా ఉద్యోగులకు స్త్రీశక్తి కొండంత అండగా నిలుస్తుంది.

మెగా డీఎస్సీ-2025 వరం



రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడు లేని రీతిలో మెగా డీఎస్సీ-2025 నిర్వహించి నిరుద్యోగ యువతకు చేయూతగా కూటమి ప్రభుత్వం నిలిచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో వివిధ విభాగాల్లో 2,645 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. 53,787 మంది నిరుద్యోగ ఉపాధ్యాయులు దరఖాస్తులు చేశారు. పోటీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం మెరిట్ జాబితా గత నెల 23న విడుదలు చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తి చేశారు. ఇక్కే ఇంట్లో ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కప్పట్రాళ్ల వంటి ఫ్యాక్షన్ గ్రామంలో ఏకంగా ఎనిమిది మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఆ గ్రామ చరిత్రలోనే ఓ రికార్డు.

మా ఇంట్లో ఐదుగురికి తల్లికి వందనం



మాకు నలుగురు కూతుళ్లు, కొడుకు ఐదుగురు సంతానం. స్థానిక జడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో పెద్ద కూతురు, జేబీఎం పాఠశాలలో మరో నలుగురు ప్లిలు చదువుతున్నారు. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ.13 వేలు ప్రకారం ఐదుగురు పిల్లలకు రూ.65 వేలు సీఎం చంద్రబాబు ఖాతాలో జమ చేశారు. మా కష్టాలు తీరిపోయాయి.

● బెళగల్ నరసమ్మ, ఈరన్న దంపతులు, కోసిగి

రూ.7 వేలు ఖాతాలో వేశారు



మాకు ఐదు ఎకరాల పొలం ఉంది. వివిధ పంటలు సాగు చేస్తున్నాను. ఖరీఫ్ ప్రారంభంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.7 వేలు తొలి విడత డబ్బులు వేశారు. పెట్టుబడికి ఎంతో సాయం అయ్యింది. మరో రూ.13 వేలు రెండు విడతల్లో వేస్తారని అధికారులు చెప్పారు.

● పి.సిద్ధిక్‌సాబ్, రైతు, హోళగుంద

పీ-4లో భాగస్వాములు కావాలి: జడ్పీ సీఈవో


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసర రెడ్డి

నందవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ-4లో అధికారులు, నాయకులు భాగస్వాములు కావాలని జడ్పీ సీఈవో నాసరరెడ్డి పిలుపునిచ్చారు. నందవరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పీ-4పై అదనపు ఎంపీడీవో సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జడ్పీ సీఈవో మాట్లాడుతూ మండలంలో 2,958 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు మాట్లాడుతూ తాను ఓ కుటుంబాన్ని దత్తత తీసుకుని బంగారు కుటుంబంగా మలుస్తానని చెప్పారు. నందవరంలో అత్యంత పేదల జాబితా తయారు చేసి ఇవ్వాలని కోరారు. ఏపీ బీసీ కో- ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ రాముడు, కాశీంవలి మాట్లాడుతూ అవగాహన కల్పిస్తే గ్రామస్థాయి నాయకులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఐటీడీపీ తాలుకా అధ్యక్షుడు వీరేష్, ఆదిశేషు జబ్బార్, జనసేన మండల అధ్యక్షుడు యల్లప్ప పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

కోసిగి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదోనిలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోసిగి పట్టణ ఎస్సీ సెల్ నాయకుడు మారేష్ సతీమణి శైలజను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఆమెను ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం టీడీపీ కార్యకర్తలకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు భరద్వాజ శెట్టి, కోసిగి ఎంపీటీసీ రాజు, మారేష్ తదితరులున్నారు.

రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాఘవ్రేందస్వామి మూల బృందావనానికి వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య బంగారు కవచ సమర్పణ సేవ రమణీయంగా సాగింది. మంగళవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతా భిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడముచ్చటగా అలంకరించారు.

కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

నందవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీసీ కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ రాముడును మంగళవారం నందవరంలో టీడీపీ నాయకులు సన్మానించారు. టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలి, సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు నదిక్కైరవాడి వీరేష్, జనసేన మండల అధ్యక్షుడు యల్లప్ప మంగళవారం ఘనంగా సన్మానించారు. టీడీపీ నాయకులు గోపాల్, ఆదిశేషు, చంద్ర, నాగలదిన్నె నరసింహులు, పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటం : సీఐటీయూ

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలపై, హక్కుల పరిరక్షణకు పోరాడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గోవిందు ఆధ్వర్యంలో సీఐటీయూ 4వ మహాసభలో మండల నాయకురాలు శైలజ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాముడు, రమేష్, శివలక్ష్మి, నాగరాజు, నాగలక్ష్మి, సల్మాన్ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కరెకృష్ణ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయులకు, డైట్ లెక్చరర్స్, మండల విద్యాశాఖ అధికారులుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. చంద్రశేఖర్, జయానంద్, మనోరంజని తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో పోటీ చేస్తాం

మంత్రాలయం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని, ఇందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జనసేన మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. మంగళవారం తన నివాసంలో జనసేన నాయకుడు రామ్ ప్రసాద్‌తో కలిసి లక్ష్మన్నతో కలిసి మాట్లాడారు. కౌతాళం మండలంలో పార్టీ ప్రతిష్టతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పార్టీకి దూరంగా ఉన్న నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపై తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోగా ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

పత్తి పంటలో లద్దె పురుగులు: ఏడీఏ

మంత్రాలయం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పత్తి పంటకు లద్దె పురుగు సోకిందని, రైతులు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి పొందుతారని ఏడీఏ మహ్మద్ ఖాద్రి అన్నారు. మంగళవారం మంత్రాలయం ఏవో జీర గణేష్ తో కలిసి చిలకలడోన, మాలపల్లి గ్రామాల్లో పత్తి పంటలను పరిశీలించారు. పత్తికి లద్దె పురుగు సోకిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు పొంది మందులను పిచికారి చేయాలని సూచించారు. ఏఈవో తిరుమల్‌రెడ్డి, రైతు రత్నం పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరు/ కోసిగి సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సఫరున్నీసా బేగం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని పార్లపల్లిలో 1వ కేంద్రం, కడివెళ్లలో 1వ కేంద్రం, ఎస్ నాగలాపురంలో 1వ కేంద్రంలో, టీఎస్ కూళూరులో 2వ కేంద్రం, పట్టణంలోని లక్ష్మీపేటలోని 31 కేంద్రం, నందవరం మండలంలోని కనకవీడు 1వ కేంద్రం, గోనేగండ్ల మండలంలో పుట్టపాశంలోని 1వ కేంద్రం, హెచ్ కైరవాడిలో 1వ కేంద్రంలో ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 17లోగా దరఖాస్తు ఫారాలను ఎమ్మిగనూరు ఐసీడీఎస్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. పూర్తి వివరాలకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం సిబ్బందిని సంప్రదించాలన్నారు. కోసిగి టౌన్‌లోని అంగన్‌వాడీ సెంటర్- 15లో ఈడబ్ల్యూఎస్, జుమాలదిన్నె అంగన్‌వాడీ సెంటర్-2లో బీసీ (సీ) మహిళ రిజర్వేషన్‌లో రెండు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాత్యాయని తెలిపారు. అభ్యర్థులు 7వ తరగతి పాసై ఉండాలని, 1.7.2025 నాటికి 25 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. ఈ నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు.

సొసైటీలో సభ్యులుగా ఉంటే ప్రమాద బీమా

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి


బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సొసైటీలో రైతులు సభ్యులుగా ఉంటే ప్రమాద బీమా వర్తిస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మాధవరం గ్రామంలో కల్లుదేవకుంట సొసైటీ సభ్యుడిగా వగరూరు గ్రామానికి చెందిన ఖాజా హుశేన్ ప్రమాదవశాత్తు మరణించారు. ప్రమాద బీమా రూ.2 లక్షలు మంజూరు కాగా మంగళవారం చెక్కును సొసైటీ చైర్మన్ రాగమ్మ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ నర్సిరెడ్డి, సొసైటీ సీఈవో వెంకటేశ్, డైరెక్టర్ లక్ష్మన్న, కిశోర్, మోహన్, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదుతో ప్రయోజనం

కోసిగి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంట నమోదుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. మండలంలోని కందుకూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అలాగే నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. మండలలో యూరియా కొరత లేదన్నారు. కందుకూరు, కడిదొడ్డి గ్రామాల్లో రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయకులు మధుసూదన్ గౌడు, రాజశేఖర్, గ్రామ పెద్దలు కురువ అయ్యన్న, కడిదొడ్డి నరసయ్య, సుమన్, రాంప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

12 నుంచి దశమి ఉత్సవాలు

గోనెగండ్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 12 నుంచి 16 వరకు నిర్వహించనున్న దశమి ఉత్సవాల్లో భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో మణిమంజరి, మేజర్ సర్పంచ్ హైమావతి తెలిపారు. మంగళవారం కార్యదర్శి సతీష్‌తో కలిసి దేవాలయానికి వెళ్లే రోడ్డు పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు గాను ఈనెల 11నుంచి 14 వరకు ప్రత్యేక మోటార్లు ఏర్పాటు చేసి ప్రతిరోజు నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్య డిప్యూటీ ఎంపీడీవో అనంతశయన, అడ్వ కేట్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్, బాబు నాయుడు. సిబ్బంది పాల్గొన్నారు.